సంపుటి : 9
సంచిక : 348
బుధవారం
09 సెప్టెంబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE

విశ్వవాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
వెంటనే స్కాన్ చేయండి!
ఇప్పుడే చదవండి!
Contact For Ads:
7579339999

## ప్రజా సేవలపై మరింత దృష్టి పెట్టాలి




- ఉత్తమ పద్ధతులను అన్ని నియోజకవర్గాల్లో అమలు చేయాలి
- ఉచిత ఇసుక విధానంపై ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం
- ఫేక్ ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలని సూచన
- భూ రికార్డుల ప్రక్షాళన 2027 మార్చి నాటికి పూర్తి

- లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో సీఎం చంద్రబాబు

**అమరావతి, నేటివార్త :** ప్రభుత్వ, పరిపాలన సేవ లను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందిం చడంపై దృష్టి సారించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ ఎమ్మె ల్యేలు, నాయకులకు పిలుపునిచ్చారు. రెండో రోజు నిర్వ హించిన లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో ప్రసంగించిన ఆయన, కొన్ని నియోజకవర్గాలు పౌర సేవల అమలులో విశేష ఫలితాలు సాధిస్తున్నాయని పేర్కొన్నారు. ఆ ప్రాంతాల్లో అమలవుతున్న ఉత్తమ పద్ధతులను రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలు అనుసరించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టంచేశారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం మిగతా .. 2లో..

మోదీ హాజరయ్యే సదస్సు..

## పిఎంవో ఫేక్ ఐడీ, తుపాకీ కలకలం



**సెప్టెంబర్ 08, విశ్వం వాయిస్ న్యూస్ :** ముంబయిలో ప్రధాని మోదీ పాల్గొనాల్సిన ఓ కార్యక్రమంలో భద్రతా సమస్య ఎదురైంది. కొన్ని గంటల ముందే సభా ప్రాంగణంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను ముంబయి పోలీసులు అరెస్టు చేశారు. అనుమానితుడి వద్ద ప్రధానమంత్రి కార్యాలయం పేరుతో ఫేక్ ఐడీ కార్డు, అతడి బాడీగార్డ్‌గా పేర్కొన్న మరో వ్యక్తి వద్ద తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. విషయం తీవ్రత దృష్ట్యా.. ముంబయి క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఈ కేసు దర్యాప్తు బాధ్యతను చేపట్టారు. ప్రస్తుతం ఆ ఇద్దరినీ విచారిస్తున్నారు. ముంబయిలోని బాంద్రా- కుర్లా కాంప్లెక్స్‌లోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్‌లో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ కార్యక్రమం జరగనుంది. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సును ప్రధాని మోదీ మంగళవారం సాయంత్రం ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో వేదిక సమీపంలో తనిఖీలు చేస్తున్న పోలీసులకు ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని మిగతా .. 2లో..

తెలుగు రాష్ట్రాల్లో ఉద్యోగులు, విద్యార్థులకు

## వరుసగా మూడు సెలవులు

**శని, ఆది, సోమవారాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు హాలిడేస్**

**సెప్టెంబర్ 14న వినాయక చవితి పండగ సందర్భంగా ప్రభుత్వ సెలవు**

**ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రారంభమైన చవితి మండపాల ఏర్పాట్లు**

**అమరావతి, సెప్టెంబర్ 08, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులకు ఈ వారాంతంలో వరుస సెలవులు రానున్నాయి. వినాయక చవితి పండగతో పాటు శని, ఆదివారాలు కలిసి రావడంతో మూడు రోజుల పాటు సుదీర్ఘ వారాంతం (లాంగ్ వీకెండ్) రానుంది. ఫలితంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు మూతపడనున్నాయి. సెప్టెంబర్ 12వ తేదీ మిగతా .. 2లో..

వైసీపీ నుంచి

## టీడీపీలోకి ఇంకా వస్తారు

- వైసీపీ సీనియర్ నేత బొత్స మేనల్లుడు చిన్న శ్రీను టీడీపీలో చేరిక
- ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో కుమార్తెతో సహా పార్టీలో చేరిక
- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలనే ఈ నిర్ణయం తీసుకున్నానని వెల్లడి
- చిన్న శ్రీను వ్యాఖ్యలతో ఏపీ రాజకీయాల్లో వలసలపై కొత్త చర్చ



**అమరావతి, సెప్టెంబర్ 08, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మంగళవారం ఒక కీలక పరిణామం చోటు చేసుకుంది. వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు మిగతా .. 2లో..

సోషల్ మీడియాను

## ఎంతమంది యాక్టివ్‌గా వాడుతున్నారు?


**సోషల్ మీడియా వినియోగంపై టీడీపీ నేతలకు నారా లోకేశ్ దిశానిర్దేశం**

**ప్రభుత్వ అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన**

**ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని సోషల్ మీడియాలో తిప్పికొట్టాలని పిలుపు**

**ప్రధాని మోదీని, తనను ఉదాహరణగా చూపుతూ నేతలకు దిశానిర్దేశం**

**అమరావతి అభివృద్ధిని విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశం**



**అమరావతి, సెప్టెంబర్ 08, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రెండో రోజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. 'పొలిటికల్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ ఓరియంటేషన్' అనే అంశంపై మాట్లాడుతూ, ఆయన నేరుగా సభికులను "మీలో ఎంతమంది సోషల్ మీడియాను చురుకుగా వినియోగిస్తున్నారు?" అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నతోనే సాంకేతికతను రాజకీయ మిగతా .. 2లో..

పరిశ్రమలు తమ ఖాళీ స్థలాలను

## హరిత వనాలుగా మార్చాలి

స్థానిక వృక్ష జాతులతో గ్రీన్ బెల్ట్‌ను మరింత విస్తరించాలి
నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి
మియావాకి పద్ధతిలో దట్టమైన వనాలను అభివృద్ధి చేయాలి
దివిస్‌లో గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి, ప్లాంటేషన్ కార్యక్రమాలపై ఏపీ గ్రీన్ ఛైర్మన్ నాగబాబు సమీక్ష



**కాకినాడ, సెప్టెంబర్ 08, విశ్వం వాయిస్ న్యూస్ :** పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణకు పరిశ్రమలు తమ గ్రీన్ బెల్ట్‌ను మరింత విస్తరించి, స్థానిక వృక్ష జాతులతో దట్టమైన పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ నాగబాబు స్పష్టం చేశారు. పరిశ్రమల యాజమాన్యాలు, మిగతా .. 2లో..

## కిలో ఉల్లిగడ్డలు 32 రూపాయలే

మంత్రి నాదెండ్ల మనోహర్



**అమరావతి, సెప్టెంబర్ 08, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న సామాన్య ప్రజలకు కూటమి ప్రభుత్వం ఊరట కల్పించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. వంటింటి భారాన్ని తగ్గించే లక్ష్యంతో, కిలో ఉల్లిపాయలను కేవలం రూ.32కే రాయితీపై అందించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం సోషల్ మీడియా ద్వారా మిగతా .. 2లో..

## చిరంజీవి కుమార్తె సుస్మితకు కీలక పదవి


విజయవాడ దుర్గమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డులో ప్రత్యేక ఆహ్వానితురాలిగా నియామకం



**విజయవాడ, సెప్టెంబర్ 08, విశ్వం వాయిస్ న్యూస్ :** మెగాస్టార్ చిరంజీవి కుమార్తె, సినీ నిర్మాత కొణిదెల సుస్మితకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు లభించాయి. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గ అమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డులో ఆమెను ప్రత్యేక ఆహ్వానితురాలిగా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి కన్నబాబు అధికారికంగా ఉత్తర్వులు జారీ మిగతా .. 2లో..

## నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి

డీఎస్సీలో అక్రమాలు జరిగాయన్న మార్గాని భరత్




**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 08, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ డీఎస్సీ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని, దీనికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని వైసీపీ మాజీ ఎంపీ మార్గాని భరత్ డిమాండ్ చేశారు. విజిలెన్స్ విచారణ జరుగు తోందని అధికారులు చెప్పారని... దీని అర్థం డీఎస్సీలో అక్రమాలు జరిగాయని చెప్పడమేనన్నారు. విజిలెన్స్ పేరుతో మిగతా .. 2లో..

మైనర్ బాలికపై

## అత్యాచారం

నిందితుడికి మరణశిక్ష



**టి.నగర్ (చెన్నై), సెప్టెంబర్ 08, విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడులోని తిరునెల్వేలిలో ఓ మైనర్ బాలికపై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో పోక్సో మిగతా .. 2లో..

## ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు



**హైదరాబాద్, సెప్టెంబర్ 08, విశ్వం వాయిస్ న్యూస్ :** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సస్పెన్షన్ వేటు వేశారు. ఇద్దరినీ సస్పెండ్ చేయాలని శాసనమండలిలో మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించిన ఛైర్మన్.. సెషన్ మొత్తానికి ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. అనంతరం మండలి వాయిదా పడింది. అంతకుముందు శాసనసభ కూడా తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని తీర్మానించింది. మంత్రి దామోదర రాజనర్సింహ ఈ మేరకు సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. "స్పీకర్‌పై తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి దూషణలను సభ తీవ్రంగా ఖండిస్తోంది. సభామర్యాదలకు విరుద్ధమైన వ్యాఖ్యలపై నిరసన తెలుపుతోంది. మహిళల ఎదుట అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని ఖండిస్తోంది. బీఆర్ఎస్ సభ్యుల మిగతా .. 2లో..

## సెప్టెంబరు 11న మోదీ-పుతిన్ భేటీ



**సెప్టెంబర్ 08, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాని నరేంద్ర మోదీ సెప్టెంబర్ 11న రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ కానున్నారు. ఈ నెల 12-13 తేదీలలో దిల్లీలో భారత్ అధ్యక్షతన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్న విషయం తెలిసిందే. ఆ సమావేశానికి ముందు ఇరువురు దేశాధినేతలు ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొననున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు. భారత్ తమకు వ్యూహాత్మక భాగస్వామి అని.. ఇరుదేశాల మధ్య భద్రత, అంతరిక్షం, ఇంధనం, రవాణా, సైన్స్ అండ్ టెక్నాలజీ సహా పలు రంగాలలో సహకారం విస్తరిస్తోందన్నారు. ఇరుదేశాల నేతలు ద్వైపాక్షిక సమావేశం లో వాణిజ్యం, ఆర్థిక సంబంధాలకు మిగతా .. 2లో..

విద్యార్థుల కోసం

## 5 లక్షల సిమ్‌కార్డులు



**సెప్టెంబర్ 08, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైని అన్నారు. ప్రస్తుతం మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ప్రజా సేవలపై మరింత దృష్టి పెట్టాలి

కట్టుదిట్టంగా అమలు చేస్తోందని చంద్రబాబు తెలిపారు. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వానికి ఏటా సుమారు రూ.1,000 కోట్ల ఆదాయం కోల్పోతున్నప్పటికీ ప్రజల ప్రయోజనాల కోసమే ఈ విధానాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు. ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే అడ్డుకోవాలని, ముఖ్యంగా ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలిపోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం విధానం పూర్తిగా అస్తవ్యస్తమైందని చంద్రబాబు విమర్శించారు. నకిలీ బ్రాండ్లను ప్రోత్సహించడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టారని ఆరోపించారు. ప్రస్తుతం మద్యం విక్రయాల్లో పారదర్శకత తీసుకొచ్చామని, ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం విక్రయాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షించాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై జరుగుతున్న ఫేక్ ప్రచారాలను వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని పార్టీ నేతలకు సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అనేక ప్రభుత్వ సేవలను ప్రజలకు ఆన్‌లైన్‌లో అందిస్తున్నామని తెలిపారు. క్యూఆర్ కోడ్, బ్లాక్‌చెయిన్ సాంకేతికత ఆధారంగా భద్రమైన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు సరైన సమాచారం చేరేలా నాయకులు చొరవ చూపాలని కోరారు. నియోజకవర్గాల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను స్వచ్ఛందంగా గుర్తించి పరిష్కరించాలని చంద్రబాబు సూచించారు. ప్రజల సమస్యల పట్ల మానవత్వంతో స్పందిస్తే ప్రజల్లో సానుకూల దృక్పథం ఏర్పడుతుందని చెప్పారు. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ వారి అవసరాలను అర్థం చేసుకుని పరిష్కార మార్గాలు చూపాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే నాయకులకు మంచి పేరు తీసుకువస్తుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భూ వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చంద్రబాబు వెల్లడించారు. 2027 మార్చి నాటికి భూ రికార్డుల ప్రక్షాళన పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. 'సంజీవని' ప్రాజెక్టు ద్వారా ప్రజలకు డిజిటల్ ఆరోగ్య రికార్డులు అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. గత సమావేశంలో ఎమ్మెల్యేలు ప్రస్తావించిన అంశాలను సమీక్షించి, రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన 616 అభివృద్ధి పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఈ సందర్భంగా ప్రకటించారు.

**స్థానిక ఎన్నికలు.. అత్యుత్తమ అభ్యర్థులను ఎంపిక చేయాలి: సీఎం చంద్రబాబు**

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపిక నుంచి క్షేత్రస్థాయి సమన్వయం వరకు ప్రతి అంశంలో అప్రమత్తంగా ఉండాలని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు పార్టీ నేతలకు సూచించారు. అమరావతిలో నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో స్థానిక ఎన్నికల సన్నాహాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. గెలుపే లక్ష్యంగా పనిచేస్తూనే కూటమిలో బ్యాలెన్సింగ్ పాటించాలని సూచించారు. సీట్లు, రిజర్వేషన్లపై కొందరు కోర్టులకు వెళ్లినా.. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా మేయర్లు, ఛైర్మన్లను ఎన్నుకునేలా నిర్ణయం తీసుకున్నామని చంద్రబాబు తెలిపారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా.. పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా అత్యుత్తమ అభ్యర్థులను ఎంపిక చేయాలని ఆదేశించారు. కమిటీల ద్వారా అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రాగద్వేషాలకు అతీతంగా క్షేత్రస్థాయిలో నేతలంతా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. పార్టీకి నష్టం కలిగించే చర్యలకు పాల్పడితే సస్పెన్షన్ వేటు తప్పదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు.. వైకాపా దుష్ప్రచారాన్ని వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని చంద్రబాబు స్పష్టం చేశారు. వైకాపా ఫేక్ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టి ఓటు బ్యాంక్‌ను మరింత బలోపేతం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఓటు వేయని వారినీ చేసిన అభివృద్ధితో ఆకట్టుకుని పార్టీకి అనుకూలంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.

**ఎల్‌నినో.. తాగునీటికే మొదటి ప్రాధాన్యం: చంద్రబాబు**

ఎల్‌నినో వల్ల ఏపీపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 54శాతం లోటు వర్షపాతం నమోదైందని, జలాశయాల్లో గతేడాది 737 టీఎంసీల నీరు ఉంటే.. ఈసారి 530 టీఎంసీలే ఉందని తెలిపారు. ఎల్‌నినోపై జరిగిన చర్చలో నేతలకు ఆయన దిశానిర్దేశం చేశారు. భూగర్భ జలాలు కూడా గణనీయంగా తగ్గుతున్నాయని అన్నారు. "నెల్లూరు, తిరుపతి, కోనసీమ జిల్లాల్లో వేయాల్సిన దానికన్నా ఎక్కువగా పంటలు వేశారు. మార్కాపురం, పోలవరం, ప్రకాశం జిల్లాల్లో 12శాతం పంటలే వేశారు. ఉద్యాన పంటలు కూడా పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు. సంక్షోభం దృష్ట్యా తాగునీటికే మొదటి ప్రాధాన్యత ఇస్తాం. బోర్లు ఎండిపోయిన చోట తాగునీటి కొరత లేకుండా చూడాలి. ప్రతి ఎకరాన్నీ పీఎండీఎస్ విధానంలో సాగు చేసేలా చూడాలి. 32 రకాల విత్తనాలను పీఎండీఎస్ ద్వారా సాగు చేసేందుకు అవకాశం ఉంది. సాగునీటి ప్రాజెక్టులకు మా ప్రభుత్వమే ఎక్కువ ఖర్చు చేసింది. ఉచిత ఇసుక.. ఇతర రాష్ట్రాలకు వెళ్తే అడ్డుకోవాలి. ఏటా రూ.1000 కోట్ల ఆదాయం వదులుకొని ఉచిత ఇసుక ఇస్తున్నాం. వైకాపా పాలనలో జే బ్రాండ్ల వల్ల 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. మద్యాన్ని ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించేందుకు వీల్లేదు. గొడ్డలి పార్టీ నేతల దుష్ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దు. టీచర్లను బెదిరించే స్థాయికి గొడ్డలి పార్టీ మీడియా దారుణాలకు ఒడిగట్టింది. ఇలా బరితెగించే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించ కూడదు" అని చంద్రబాబు అన్నారు.

**మోదీ హాజరయ్యే సదస్సు..**

# పిఎంవో ఫేక్ ఐడీ, తుపాకీ కలకలం

ప్రశ్నించగా.. రోహన్ పరేఖ్ (24) అనే వ్యక్తి వద్ద ప్రధానమంత్రి కార్యాలయం పేరుతో ఫేక్ ఐడీ కార్డు, అతడి గన్‌మెన్ వద్ద తుపాకీ లభించింది. అప్రమత్తమైన అధికారులు వాటిని స్వాధీనం చేసుకొని వారిద్దర్నీ అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**తెలుగు రాష్ట్రాల్లో ఉద్యోగులు, విద్యార్థులకు**

# వరుసగా మూడు సెలవులు

రెండో శనివారం, 13వ తేదీ ఆదివారం కావడంతో సాధారణ సెలవు దినాలు ఉన్నాయి. వీటికి అదనంగా సెప్టెంబర్ 14 సోమవారం నాడు వినాయక చవితి పండగ సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించింది. దీంతో శని, ఆది, సోమవారాల్లో ఉద్యోగులకు, విద్యార్థులకు వరుసగా మూడు రోజులు పాటు విరామం లభించనుంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో వినాయక చవితి వేడుకల సందడి నెలకొంది. స్థానికులు, ఉత్సవ కమిటీలు మండపాలను ఏర్పాటు చేస్తూ పండగ సన్నాహాల్లో నిమగ్నమయ్యారు. ఈ మూడు రోజుల వరుస సెలవులతో పండగ వాతావరణం మరింత సంతరించుకోనుంది. కాగా, వినాయక విగ్రహాల నిమజ్జనం రోజున కూడా ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను బట్టి స్థానిక సెలవు ప్రకటించే అవకాశం ఉంది.

**వైసీపీ నుంచి**

# టీడీపీలోకి ఇంకా వస్తారు

దారితీశాయి. వైసీపీ నుంచి ఇంకా చాలామంది నేతలు టీడీపీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారని, త్వరలోనే మరిన్ని చేరికలు ఉంటాయని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో చిన్న శ్రీను, ఆయన కుమార్తె సిరి సహస్ర టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వంగలపూడి అనిత, జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, ఎంపీ అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు బేబినాయన, అదితి గజపతిరాజు, కళా వెంకట్రావు వంటి పలువురు ఉత్తరాంధ్రకు చెందిన సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ రాష్ట్రంలో గత రెండేళ్లుగా అభివృద్ధి, సంక్షేమం జోడు గుర్రాల్లా పరుగుపెడుతున్నాయని అన్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర, విజయనగరం జిల్లా అభివృద్ధిని దృష్టిలో ఉంచుకునే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోటీ పడుతూ ఏపీని ప్రథమ స్థానంలో నిలబెట్టే వారి ప్రయత్నంలో నేను కూడా భాగస్వామిని కావాలనుకుంటున్నాను. ఈ అభివృద్ధి యజ్ఞంలో పాలుపంచుకోవాలనే తపనతోనే టీడీపీలో చేరాను" అని వివరించారు. భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ముందు జగన్‌కు స్వాగతం పలికిన మీరు, ఇంత సడన్‌గా పార్టీ మారడానికి కారణమేమిటని విలేకరులు ప్రశ్నించగా.. గత రెండేళ్లుగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగం కావాలనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని బదులిచ్చారు. "వైసీపీ నుంచి ఇంకా ఎవరైనా వస్తారా?" అన్న ప్రశ్నకు, "ఇంకా వస్తారు.. చాలామంది వస్తారు" అని ఆయన నొక్కి చెప్పడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. జిల్లాకు వెళ్లాక మరిన్ని విషయాలు పూర్తిస్థాయిలో వెల్లడిస్తానని తెలిపారు.

**పరిశ్రమలు తమ ఖాళీ స్థలాలను**

# హరిత వనాలుగా మార్చాలి

ఉద్యోగులు సమష్టి బాధ్యతతో నిరంతరం కృషి చేసినప్పుడే పర్యావరణానికి మేలు చేసే స్థిరమైన గ్రీన్‌బెల్ట్‌ను అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మంగళవారం కాకినాడ జిల్లా తొండంగి మండలం ఒంటిమామిడి గ్రామంలోని దివిస్ లేబొరేటరీస్ ను సందర్శించి, పరిశ్రమలో కొనసాగుతున్న గ్రీన్ బెల్ట్ అభివృద్ధి, ప్లాంటేషన్ కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ "పరిశ్రమలు తమ పరిధిలోని ఖాళీ ప్రదేశాలను వినియోగించుకుని గ్రీన్ బెల్ట్‌ను మరింత విస్తరించాలి. పెద్దగా పెరిగే స్థానిక వృక్ష జాతులకు ప్రాధాన్యం ఇచ్చి మొక్కలు నాటాలి. అనుకూలమైన ప్రతి చోట మియావాకి పద్ధతిలో దట్టమైన వనాలను అభివృద్ధి చేయాలి. పరిశ్రమలలో అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలన్నింటినీ దశలవారీగా హరిత వనాలుగా మార్చాలి. నాటిన మొక్కల సంరక్షణ, మనుగడపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి" అన్నారు. దివీస్ ల్యాబ్స్‌లో గ్రీన్ బెల్ట్ పరిశీలించిన నాగబాబు అంతకు ముందు నాగబాబు దివీస్ పరిశ్రమ ప్రాంగణాన్ని సందర్శించి, ఇప్పటికే అభివృద్ధి చేసిన గ్రీన్ బెల్ట్, మొక్కలు నాటిన ప్రాంతాలను పరిశీలించారు. అలాగే భవిష్యత్‌లో మరింత హరిత ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశ్రమ ప్రతినిధులు ప్రస్తుతం చేపడుతున్న ప్లాంటేషన్ కార్యక్రమంతోపాటు, భవిష్యత్‌లో గ్రీన్ బెల్ట్‌ను మరింత విస్తరించేందుకు రూపొందించిన ప్రణాళికలను నాగబాబుకి వివరించారు. అనంతరం దివిస్ లేబొరేటరీస్‌కు చెందిన 100 మందికి పైగా ఉద్యోగులతో కలిసి నాగబాబు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఉద్యోగులు చురుకుగా పాల్గొనడాన్ని ఆయన అభినందించారు. ఇప్పటి వరకు పరిశ్రమ ప్రాంగణంలో వివిధ జాతులకు చెందిన మొత్తం 25,150 మొక్కలను నాటినట్లు పరిశ్రమ ప్రతినిధులు నాగబాబుకి తెలిపారు. అనంతరం దివిస్ లేబొరేటరీస్ ప్రతినిధులు పరిశ్రమ చేపడుతున్న సీఎస్ఆర్ కార్యక్రమాలపై నాగబాబుకి వివరాలను అందించారు. పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవల కోసం కేటాయిస్తున్న సీఎస్ఆర్ నిధులు, వాటి వినియోగం, అలాగే సీఎస్ఆర్‌లో భాగంగా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

# ఎంతమంది యాక్టివ్‌గా వాడుతున్నారు?

ప్రచారానికి వాడుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. "సోషల్ మీడియానే కదా అని తేలిగ్గా తీసుకోవద్దు. దీనిపై చాలా సీరియస్‌గా ఉండాలి" అని లోకేశ్ నేతలకుస్పష్టం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయాలని ఆయన సూచించారు. చిన్న స్థాయి నాయకులైన ఏఎంసీ, కార్పొరేషన్ ఛైర్మన్లు కూడా తాము చేస్తున్న పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరిస్తున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని ఆయన ఉదాహరణగా చూపారు. ప్రధాని మోదీ సైతం తన సందేశాలను సెల్ఫీ వీడియోల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు. తాను కూడా సుజ్లాన్ విండ్ ప్రాజెక్టు శంకుస్థాపన, డీఎస్సీపై జరుగుతున్న దుష్ప్రచారం వంటి అంశాలపై సెల్ఫీ వీడియోలు తీసి వాస్తవాలను ప్రజల ముందు ఉంచానని తెలిపారు. విషయం చిన్నదైనా, పెద్దదైనా ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత నేతలపై ఉందని అన్నారు. ప్రతిపక్షాల తీరుపై లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షం పని కేవలం ప్రభుత్వంపై బురదజల్లడమేనని, వారి దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు తమ నాయకుడు 'జగన్ మావిగన్' అంటే గుడ్డిగా సమర్థిస్తున్నారని, కానీ టీడీపీ అలా కాకుండా వాస్తవాలతో ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

# కిలో ఉల్లిగడ్డలు 32 రూపాయలే

వివరాలు వెల్లడించారు. వచ్చే వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 115 రైతు బజార్లు, ప్రత్యేక మొబైల్ కౌంటర్ల ద్వారా ఈ రాయితీ ఉల్లిపాయల విక్రయాలు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. ఉల్లితో పాటు, చౌకధరల దుకాణాల (రేషన్ డిపోలు) ద్వారా రాయితీపై కందిపప్పు, పామాయిల్ కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే దాదాపు 30 శాతం తక్కువ ధరకే నాణ్యమైన సరుకులను ప్రజలకు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి సహకారం అందిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్నారు.

# చిరంజీవి కుమార్తె సుస్మితకు కీలక పదవి

చేశారు. ఈ నియామకంతో సుస్మిత ఇకపై దుర్గమ్మ ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామి కానున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు కల్పిస్తున్న వసతులు, ఆలయంలో చేపట్టే అభివృద్ధి పనులు, దసరా నవరాత్రులు వంటి ప్రత్యేక ఉత్సవాల నిర్వహణపై ఆమె ట్రస్ట్ బోర్డుకు తగిన సలహాలు, సూచనలు అందిస్తారు. సుస్మిత కొణిదెల 'గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్' బ్యానర్‌పై చిత్రాలను నిర్మిస్తూ నిర్మాతగా రాణిస్తున్నారు. ఇటీవల తన తండ్రి చిరంజీవితో నిర్మించిన 'మన శంకర వర ప్రసాద్ గారు' చిత్రంతో ఆమె మంచి విజయాన్ని అందుకున్నారు. ఆసక్తికరంగా సుస్మిత తల్లి కొణిదెల సురేఖ తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా సేవలు అందిస్తున్నారు. ఇప్పుడు సుస్మితకు కూడా ఏపీలోని ప్రముఖ ఆలయ బోర్డులో స్థానం లభించడం విశేషం.

# నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి

కాలయాపన చేయకుండా ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులను బయటకు తీసేందుకు సీబీఐ చేత సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్పోర్ట్స్ కోటా కింద కేటాయించిన 382 ఉద్యోగాలను ఎవరికి ఇచ్చారో పూర్తి వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని, నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిపై ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని మార్గాని భరత్ నిలదీశారు. జూడో అసోసియేషన్ ఛైర్మన్‌గా ఉన్న లోకేశ్ తోడల్లుడు శ్రీభరత్ పైనా ఆరోపణలు చేస్తూ... పక్కా ప్రణాళిక ప్రకారమే ఈ అక్రమాలు జరిగాయని విమర్శించారు. అసెంబ్లీని, ప్రజలను పచ్చి అబద్ధాలతో తప్పుదోవ పట్టించిన లోకేశ్ కి జగన్‌ను విమర్శించే స్థాయి లేదన్నారు. "లోకేశ్ ఎమ్మెల్యే కాకముందే నేను ఎంపీగా గెలిచాను. డీఎస్సీ అక్రమాలపై లోకేశ్ తో ఎక్కడైనా చర్చకు నేను సిద్ధం. కరకట్ట నివాసమైనా, హైదరాబాద్ ఇల్లయినా తేదీ, సమయం ఆయనే ప్రకటించాలి" అని బహిరంగ సవాల్ విసిరారు.

# మైనర్ బాలికపై అత్యాచారం

ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నాలుగేళ్ల క్రితం జరిగిన ఈ ఘటనలో ఒక నిందితుడికి న్యాయస్థానం మరణశిక్ష విధించింది. మరో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే.. తిరునెల్వేలికి చెందిన 16 ఏళ్ల బాధితురాలికి 2022లో పెయింటర్‌గా పనిచేసే మునీశ్వరన్ (25) పరిచయమయ్యాడు. రెండు వారాల పాటు వీరిద్దరూ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఆ తర్వాత పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆ బాలికను అతడు మీనాక్షిపురంలోని తన బంధువుల ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ తన స్నేహితులు చిన్నకుట్టి, మురుగేశన్‌తో కలిసి బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాధితురాలు తన కుటుంబసభ్యులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. దీనిపై విచారణ జరిపిన ప్రత్యేక న్యాయస్థానం.. మంగళవారం తీర్పు వెలువరించింది. గతంలో తీవ్ర నేర చరిత్ర ఉన్న చిన్నకుట్టికి మరణశిక్ష విధించిన కోర్టు.. మురుగేశన్‌కు 20 ఏళ్లు, మునీశ్వరన్‌కు 13 ఏళ్లు చొప్పున జైలు శిక్ష విధించింది.

# ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు

అనుచిత ప్రవర్తలను ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత తీసుకోవాలి. శాసనసభాపతికి కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి. నిబంధనలకు అనుగుణంగా మండలి ఛైర్మన్ చర్యలు తీసుకోవాలి" అని శాసనసభ తీర్మానించింది.

# సెప్టెంబరు 11న మోదీ-పుతిన్ భేటీ

పెద్దపీట వేయనున్నారని డిమిత్రి పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధం, గల్ఫ్ ఉద్రిక్తతలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం వంటి విషయాలపైనా చర్చలు జరిపే అవకాశం ఉందన్నారు. రష్యా-ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించడంలో భారత్ మధ్యవర్తిత్వం వహించడం తమకు అంగీకారమేనని తెలిపారు. యుద్ధాన్ని ముగించడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. ఉక్రెయిన్‌తో చర్చలు తిరిగి ప్రారంభించడానికి అమెరికా చర్యలు తీసుకుంటోందన్నారు.

**బ్రిక్స్ ఇప్పుడు ఒక భారీ కూటమి..**

బ్రిక్స్ కేవలం ఒక సాధారణ సంస్థ మాత్రమే కాదని..అదొక ప్రధాన ప్రపంచ కూటమి అని డిమిత్రి అభివర్ణించారు. ఈ కూటమి మరింత విస్తరించాలని రష్యా కోరుకుంటోందన్నారు. బ్రిక్స్ సమావేశాల్లో మరిన్ని దేశాలు పాల్గొంటే బాగుంటుందని.. ఇతర దేశాలను ఆహ్వానించడానికి తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.

**భారత్‌తో అణు సహకారంపై దృష్టి..**

రష్యా-భారత్ సహకారంలో అణు శక్తి ఒక కీలక రంగమని డిమిత్రి పేర్కొన్నారు. 'అణు రంగంలో రష్యా ప్రపంచ అగ్రగామిగా ఉంది. ప్రపంచంలోని అన్ని దేశాల కంటే మేమే ఎక్కువ అణు విద్యుత్ కేంద్రాలను నిర్మిస్తున్నాం. భారత్‌లో కుడంకుళం ప్రాజెక్ట్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. భారత్‌లో నిర్మించబోయే మరో కొత్త ప్లాంట్‌కు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి" అని పేర్కొన్నారు.

# 5 లక్షల సిమ్‌కార్డులు

మార్కెట్‌కు అనుగుణంగా వారంతా నైపుణ్యాలు నేర్చుకోవాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల కోసం 5లక్షల సిమ్ కార్డుల కొనుగోలుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఈ మేరకు ఉన్నతస్థాయి కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ-లెర్నింగ్‌లో భాగంగా ఈ ఏడాది 10 నుంచి 12 తరగతి చదివే విద్యార్థుల్లో 5లక్షల మందికి ట్యాబ్‌లు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. వీటికి ఇంటర్నెట్ సదుపాయం కల్పించేందుకు సిమ్ కార్డులు కొనుగోలు చేయాలని తాజాగా నిర్ణయించింది. తద్వారా విద్యార్థులు ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్‌తోపాటు ఇతర విద్యా సంబంధిత సోర్సుల నుంచి కొత్త నైపుణ్యాలను నేర్చుకునే వీలుంటుందని హరియాణా ప్రభుత్వం భావిస్తోంది.

# ఎడిటర్ వాయిస్

## స్థానిక సమరం : హీట్ పెంచనున్న పవన్?

తమ పార్టీకి ప్రస్తుతం ఉన్న బలాబలాల దృష్ట్యా 30 శాతం సీట్లు ఇవాలని జనసేన కోరుతోంది అన్నది గత కొంతకాలంగా ప్రచారం సాగుతోంది.

స్థానిక సంస్థలకు ఎన్నికలు అక్టోబర్ లో జరుగుతాయని అంటున్నారు. దానికి సంబంధించిన ప్రక్రియ అంతా సాగుతోంది. ఆ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఇక రాజకీయ పార్టీలు కూడా స్థానిక ఎన్నికల కోసం సమాయత్తం అవుతున్నాయి. కూటమి అధికారంలో ఉండటంతో స్థానిక ఎన్నికలను స్వీప్ చేయాలని పట్టుదలగా ఉంది. కూటమిలో టీడీపీ అయితే పార్టీ మొత్తానికి దిశా నిర్దేశం చేస్తోంది. ప్రజలలో సానుకూలత ఉందని దానిని సొమ్ము చేసుకోవాలని కోరుతోంది. మరో వైపు చూస్తే బీజేపీ కూడా లోకల్ బాడీ ఎన్నికల్లో తమ సత్తా చూపించాలని చూస్తోంది. జనసేన సైతం స్థానిక ఎన్నికల మీద పెద్ద ఆశలనే పెట్టుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత కీలకంగా భావిస్తోంది. అందుకే తమకు ఎక్కువ సీట్లు ఇవ్వాలని కూడా కోరుతోంది.

**సర్దుబాటలోనే :** తమ పార్టీకి ప్రస్తుతం ఉన్న బలాబలాల దృష్ట్యా 30 శాతం సీట్లు ఇవాలని జనసేన కోరుతోంది అన్నది గత కొంతకాలంగా ప్రచారం సాగుతోంది. అయితే దీనికి సంబంధించి ఇంకా చర్చలు మొదలు కాలేదు. కూటమి పార్టీల మధ్య సర్దుబాటు అన్నది సాఫీగా జరుగుతుందని మిత్ర పక్షాలు భావిస్తున్నాయి. ఈ విషయంలో అంతా కలిసి కూర్చుంటే సరిపోతుందని కూడా ఆలోచిస్తున్నాయి. కాస్తా అటూ ఇటూ అయినా కూటమి ఐక్యత చాలా ముఖ్యమని కూడా భావిస్తున్నాయని అంటున్నారు. అందుకే కూటమి పార్టీలు తమ శ్రేణులకు కూడా సంయమనం పాటించమని విజ్ఞప్తి చేస్తున్నాయి. ఉమ్మడి రాజకీయ ప్రత్యర్థిగా వైసీపీ ఉందని పోరాటం అక్కడ చేయాలని, మిత్ర పార్టీల మీద సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టడం వంటివి వద్దు అని కూడా సూచిస్తున్నాయి.

**కీలకంగానే ఎన్నికలు :** ఈ నేపథ్యంలో నుంచి చూసినపుడు 2024 ఎన్నికల్లో మాదిరిగానే స్థానిక సంస్థల ఎన్నికలు కూడా కీలకంగా మారబోతున్నాయని అర్థం అవుతోంది. ఇక్కడ గెలిచే సీట్లు దక్కే ఓట్లతోనే 2029 ఎన్నికల రాజకీయం ముడిపడి ఉంటుందని అంటున్నారు. దాంతో టీడీపీ అయితే అన్ని స్థాయిలలోనూ పార్టీ తరపున ఇంచార్జిలను రంగంలోకి దించింది. పార్టీ తరఫున ప్రచారం నుంచి అన్నీ ఎలా చేయాలన్నది కూడా ఆ పార్టీ అగ్ర నాయకత్వం దిశా నిర్దేశం చేస్తోంది. జనసేన విషయం తీసుకుంటే పవన్ కళ్యాణ్ సెంటర్ ఎట్రాక్షన్ అన్నది తెలిసిందే. ఆయన ఈసారి ఎన్నికల్లో ప్రచారం చేస్తారా అన్నది కూడా ఇపుడు చర్చకు వస్తున్న విషయం.

**రంగంలోకి దిగితేనే :** పవన్ కళ్యాణ్ స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రచారానికి దిగుతారా అన్నది కూడా ఇపుడు ఆసక్తిని కలిగిస్తున్న అంశంగా ఉంది. పవన్ కనుక ప్రచారానికి వస్తే జనసేనకు మంచి ఊపు వస్తుందని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు అని అంటున్నారు. అంతే కాదు క్యాడర్ కూడా ఉత్సాహం మీద పని చేస్తుందని చెబుతున్నారు. జనసేన కోరుకున్నట్లుగా నూటికి నూరు శాతం ఫలితాలు కూడా ఆ పార్టీకి దక్కుతాయని కూడా చెబుతున్నారు. ఈ విషయంలో జనసేన అధినాయకత్వం ఏ రకమైన నిర్ణయం తీసుకుంటుంది అన్నది చూడాల్సి ఉంది. పవన్ అయితే ప్రస్తుతం కేరళంలో ప్రకృతి వైద్యం తీసుకుంటున్నారు. దాంతో ఆయన ప్రచారం పెద్ద ఎత్తున చేస్తారా లేదా అన్నది కూడా అంతా ఆలోచిస్తున్నారు. టీడీపీ అయితే బడా నేతలను రంగంలోకి దింపుతోంది అని అంటున్నారు. ఇక చంద్రబాబు నారా లోకేష్ సైతం ప్రచారం చేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. వైసీపీ తరఫున జగన్ ప్రచారం చేపడతారా లేదా అన్నది తెలియాల్సి ఉంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## ఇబ్రహీంపట్నం పీఎస్‌కు యూట్యూబర్ నందన



**ఇబ్రహీంపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అరెస్టయిన యూట్యూబర్ నందనను పోలీసులు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పీఎస్‌కు తీసుకొచ్చారు. విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడ్డారంటూ నందన, ఆమె భర్తపై ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో పలువురు బాధితులు ఫిర్యాదు చేయడంతో ఇబ్రహీంపట్నం పీఎస్‌లో గతంలో కేసు నమోదైంది. ఈ విషయం వెలుగులోకి రాగానే నందన దంపతులు అజ్ఞాతంలోకి వెళ్లడంతో ఏపీ పోలీసులు లుక్ అవుట్ సర్క్యులర్(ఎల్‌వోసీ) జారీ చేశారు. ఈ క్రమంలో బ్రిటిష్ ఎయిర్‌లైన్స్ విమానంలో స్వదేశానికి ఒంటరిగా బయలుదేరిన నందన సోమవారం శంషాబాద్‌లో దిగారు. ఆమె పాస్‌పోర్ట్, వీసా పత్రాలు తనిఖీ చేసిన ఇమిగ్రేషన్ అధికారులు ఎల్‌వోసీ ఆధారంగా అదుపులోకి తీసుకొని ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. విచారణ నిమిత్తం ఇబ్రహీంపట్నం పోలీసులు పీఎస్‌కు తీసుకొచ్చారు.

## వ్యక్తిని చంపి... కవర్లలో చుట్టి

### నాగర్‌కర్నూల్ జిల్లాలో అనుమానాస్పద హత్య



**అమ్రాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** వ్యక్తిని హత్య చేసి కవర్లలో చుట్టి ఇంట్లోనే పెట్టెలో దాచిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌లో కలకలం రేపింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై ఎస్సై హన్మంత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. అమ్రాబాద్‌కు చెందిన ఎం.డి.బుర్హానుద్దీన్(50) స్థానికంగా సెల్‌ఫోన్ మరమ్మతు దుకాణం నిర్వహిస్తున్నారు. జీ రాంజీ పనుల మేట్‌గానూ పనిచేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం కొత్తపల్లె గ్రామానికి చెందిన సఫియాతో 25 ఏళ్ల కిందట ఆయనకు వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఇలియాజ్, ఖదీర్ ఉన్నారు. బుర్హానుద్దీన్ సోదరి జహంగీర్‌బీ రెండ్రోజులుగా బుర్హానుద్దీన్, ఆయన భార్య, కుమారులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎవరూ సమాధానం ఇవ్వలేదు. దీంతో విషయం తెలుసుకొనేందుకు జహంగీర్‌బీ కుమారుడు జహీర్ సోమవారం అమ్రాబాద్‌లో వారి ఇంటికి వెళ్లగా తాళం వేసి ఉంది. దుర్వాసన వస్తుండటంతో తాళం పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి చూడగా..బెడ్‌రూంలో మంచం కింద ఓ పెట్టెలో కవర్‌లో చుట్టి బుర్హానుద్దీన్ మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. గతంలో పలుమార్లు బుర్హానుద్దీన్‌పై కుటుంబసభ్యులు దాడి చేశారని జహీర్ పోలీసులకు తెలిపారు. మృతుడి భార్య, కుమారులపై అనుమానం వ్యక్తం చేస్తూ జహీర్ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కూకట్‌పల్లిలో అగ్నిప్రమాదం

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని కూకట్‌పల్లి పరిధి ప్రశాంత్‌నగర్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. ఈ ప్రమాదంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ఘటన జరిగినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



### యూరియా కలిసిన దాణా తిని

## 18 ఆవుల మృత్యువాత



**ముప్పాళ్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** యూరియా కలిసిన దాణా తినడంతో ఆవులు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం మాదలలోని గోశాలలో చోటుచేసుకుంది. ఓ రైతు నిల్వ చేసిన బస్తాల్లోని యూరియా వర్షానికి కరిగి గోవుల దాణాలో కలిసింది. మంగళవారం ఉదయం ఆ దాణా తినడంతో 18 ఆవులు మృతిచెందాయి.

## మైనర్ బాలికపై అత్యాచారం..

### నిందితుడికి మరణశిక్ష

**టి.నగర్ (చెన్నై), విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడులోని తిరునెల్వేలిలో ఓ మైనర్ బాలికపై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నాలుగేళ్ల క్రితం జరిగిన ఈ ఘటనలో ఒక నిందితుడికి న్యాయస్థానం మరణశిక్ష విధించింది. మరో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే.. తిరునెల్వేలికి చెందిన 16 ఏళ్ల బాధితురాలికి 2022లో పెయింటర్‌గా పనిచేసే మునీశ్వరన్ (25) పరిచయమయ్యాడు. రెండు వారాల పాటు వీరిద్దరూ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఆ తర్వాత పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆ బాలికను అతడు మీనాక్షిపురంలోని తన బంధువుల ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ తన స్నేహితులు చిన్నకుట్టి, మురుగేశన్‌తో కలిసి బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాధితురాలు తన కుటుంబసభ్యులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. దీనిపై విచారణ జరిపిన ప్రత్యేక న్యాయస్థానం.. మంగళవారం తీర్పు వెలువరించింది. గతంలో తీవ్ర నేర చరిత్ర ఉన్న చిన్నకుట్టికి మరణశిక్ష విధించిన కోర్టు.. మురుగేశన్‌కు 20 ఏళ్లు, మునీశ్వరన్‌కు 13 ఏళ్లు చొప్పున జైలు శిక్ష విధించింది.



### ఎన్టీఆర్ భరోసా పించన్లకు

# దరఖాస్తుల గడువు సెప్టెంబర్ 16 వరకు

## అర్హులైన ప్రతి ఒక్కరి దరఖాస్తును స్వీకరించాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్

**అమలాపురం, సెప్టెంబర్ 8, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరి ఎన్టీఆర్ భరోసా పింఛన్ దరఖాస్తును తప్పనిసరిగా స్వీకరించాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. కొత్తగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే వారికి సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. సోమవారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ ఛాంబర్ నుంచి గ్రామీణ అభివృద్ధి సంస్థ, స్వర్ణ గ్రామ-స్వర్ణ వార్డు అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డివిజన్, మండల స్థాయి అధికారులతో పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ, విధానం, అవగాహన తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. గత ఏడాది ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రతి సోమవారం సుమారు 240 పింఛన్ దరఖాస్తులు స్వీకరించిన విషయాన్ని దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లాలోని పట్టణ, గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ప్రజలు సమర్పించే పింఛన్ దరఖాస్తులను తప్పనిసరిగా స్వీకరించి, ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ప్రజాప్రతినిధుల ద్వారా ప్రజా దర్బార్‌లో అందే దరఖాస్తులను కూడా పరిశీలనలోకి తీసుకుని ఎంపీడీవోలు, ఏపీఎంలు, మున్సిపల్ కమిషనర్లు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలకు దూరం కాకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కాట్రేనికోన, రామచంద్రాపురం, కే. గంగవరం, రావులపాలెం మండలాలకు చెందిన ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ, అవగాహన కార్యక్రమాలపై వివరాలు అడిగి



తెలుసుకున్నారు. దరఖాస్తుల స్వీకరణలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే అర్హులందరికీ సెప్టెంబర్ 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకునేలా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియలో డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. లబ్ధిదారులు సమర్పించిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హులైన వారి దరఖాస్తులు సకాలంలో ప్రాసెస్ అయ్యేలా చూడాలన్నారు. పత్రాలు లేవనే కారణంతో అర్హులైన దరఖాస్తుదారులను వెనక్కి పంపడం లేదా దరఖాస్తులను అకారణంగా తిరస్కరించడం చేయరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. సాంకేతిక సమస్యలు, ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన లోపాలు లేదా ఇతర ఆధారాల కొరత ఉంటే వాటిని సంబంధిత వ్యవస్థలో నమోదు చేసి, నిబంధనల మేరకు తదుపరి ప్రక్రియ చేపట్టాలని సూచించారు. చిన్నచిన్న కారణాలతో ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పకుండా, సమస్యలను సాధ్యమైనంత వరకు సంబంధిత స్థాయిలోనే పరిష్కరించాలని ఆదేశించారు. పింఛన్ కేటగిరీకి అనుగుణంగా అవసరమైన ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుదారులు సమర్పించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. వృద్ధాప్య పింఛన్‌కు ఆధార్, వితంతు పింఛన్‌కు మరణ ధ్రువీకరణ పత్రం, దివ్యాంగుల పింఛన్‌కు సదరం సర్టిఫికెట్ అవసరమని పేర్కొన్నారు. ఒంటరి మహిళల పింఛన్‌కు తహసీల్దార్ జారీ చేసే వివాహ స్థితి ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అదేవిధంగా నేత కార్మికులు, మత్స్యకారులు, చేనేత కళాకారులు తదితర వృత్తి ఆధారిత పింఛన్ కేటగిరీలకు దరఖాస్తు చేసుకునే వారు సంబంధిత శాఖలు జారీ చేసే అర్హత, ధ్రువీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. లబ్ధిదారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దారులు తమ పరిధిలోని అర్హులైన దరఖాస్తుదారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియను వేగవంతంగా, నిబంధనల మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దరఖాస్తు ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సచివాలయ సిబ్బంది అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. సెప్టెంబర్ 16వ తేదీ చివరి గడువు కావడంతో అర్హులైన ప్రతి ఒక్కరూ సకాలంలో దరఖాస్తు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ డి. రాంబాబు, స్వర్ణ గ్రామ-స్వర్ణ వార్డు అధికారి వి.విజయలక్ష్మి, స్వర్ణ గ్రామ-స్వర్ణ వార్డు కోఆర్డినేషన్ అధికారి సువిజయ్, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి సీహెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తబితా ఫ్లోరెన్స్ బెస్ట్ రిసోర్స్ పెర్సన్

## షాడే స్కూల్ కరెస్పాండెంట్ సుజనకుమారి

**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 8, విశ్వం వాయిస్ న్యూస్ :** తమ విద్యా సంస్థ లో పనిచేస్తున్న తబితా ఫ్లోరెన్స్ బెస్ట్ రిసోర్స్ పెర్సన్ అని స్థానిక షాడే ఎయిడెడ్ ఉన్నత పాఠశాల కరెస్పాండెంట్ సుజన కుమారి కితాబు నిచ్చారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు పొందిన ఫ్లోరెన్స్ ను మంగళవారం పాఠశాల లో ఘనంగా సత్కరించారు. గతం లో తబిత ఫ్లోరెన్స్ న్యూఢిల్లీ లో జరిగిన సి.సి.ఆర్.టి (సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సస్ ట్రైనింగ్ ). నేషనల్ ట్రైనింగ్ ప్రోగ్రాము కి జిల్లా, రాష్ట్ర తరపున ప్రాతినిధ్యం వహించేరని, వారి విద్యా సేవలను అభినందించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్,రాష్ట్ర పర్యాటక శాఖామాత్యులు కందుల దుర్గేష్, అర్బన్ ఎమ్ ఎల్ ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ మున్నగు ప్రజా నాయకుల చేతుల మీదుగా ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకోవడం పాఠశాలకు, టీచర్స్, స్టూడెంట్స్‌కి స్ఫూర్తి దాయకమన్నారు.



# అన్నయ్యపేటలో 'పొలం పిలుస్తోంది'

### ఎర్రనల్లి నివారణపై రైతులకు సూచనలు



**ద్రాక్షారామ, సెప్టెంబర్ 8, విశ్వం వాయిస్ న్యూస్ :** రామ చంద్రపురం మండలంలోని అన్నయ్యపేట గ్రామంలో ఈరోజు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామ చంద్రపురం వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.అరుణ, మండల వ్యవసాయ అధికారి టి.వి.ఆర్. మణిదీప్ హాజరై స్థానిక రైతులతో కలిసి పొలాలను పరిశీలించారు. అనంతరం అధికారులు రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు. పొలాల పరిశీలనలో భాగంగా ప్రస్తుతం వరి పంటలో ఎర్రనల్లి ఆశించినట్లు గుర్తించారు. దీని నివారణకు రైతులు తగిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. నల్లి ఆకుల వెనుక భాగంలో చేరి రసాన్ని పీల్చడం వల్ల ఆకులపై తెల్లటి లేదా గోధుమ రంగు మచ్చలు ఏర్పడి ఆకులు ఎండిపోతాయని తెలిపారు. దీనివల్ల మొక్క కిరణజన్య సంయోగక్రియ దెబ్బతిని పంట ఎదుగుదల మందగిస్తుందని, పొడి వాతావరణం ఉన్నప్పుడు వీటి ఉధృతి ఎక్కువగా ఉంటుందని వివరించారు. నివారణకు ప్రొపర్గైట్ 57 శాతం మందును లీటరు నీటికి 2 మిల్లీలీటర్లు లేదా స్పైరోమెసిఫెన్ 22.9 శాతం మందును లీటరు నీటికి 1 మిల్లీలీటరు చొప్పున కలిపి ఆకుల వెనుక భాగం తడిచేలా పిచికారీ చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమం

### కంబాలపేట యూపీహెచ్సీలో ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 8, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతి సంవత్సరం సెప్టెంబర్ నెలను ప్రపంచ ఆత్మహత్యల నివారణ మాసంగా నిర్వహిస్తున్న సందర్భంగా, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం (డిస్ట్రిక్ట్ మెంటల్ హెల్త్ ప్రోగ్రాం డీఎమ్హెచ్పీ), తూర్పుగోదావరి జిల్లా ఆధ్వర్యంలో కంబాలపేట యూపీహెచ్సీలో ఆసుపత్రి సిబ్బందికి ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం బృందంతో కలిసి సైకియాట్రిస్ట్ డా. అఖిలేంద్ర శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో పాల్గొని ఆత్మహత్యాయత్నాలకు దారితీసే వివిధ కారణాలు, ఆత్మహత్యకు సంబంధించిన హెచ్చరిక సంకేతాలను గుర్తించడం, ఆత్మహత్య ఆలోచనలతో బాధపడుతున్న వ్యక్తులకు ఎలా సహాయం చేయాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఆత్మహత్యల నివారణలో సమాజంలోని ప్రతి ఒక్కరి పాత్ర ముఖ్యమని పేర్కొంటూ, అవసరమైన వ్యక్తులను తొలిదశలో గుర్తించి వారికి తగిన మానసిక సహాయం మరియు వైద్య సేవలకు అనుసంధానం చేయడంలో ఆశాలు, ఏఎన్ఎమ్ లకు గేట్ కీటర్ ట్రైనింగ్ ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బందితో కలిసి " అరికట్టాలి... అరికట్టాలి... ఆత్మహత్యలు అరికట్టాలి " అనే నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజల్లో ఆత్మహత్యల నివారణపై అవగాహన పెంపొందించడంతో పాటు, మానసిక సమస్యలతో బాధపడుతున్న వారు సహాయం కోరేందుకు ముందుకు రావాలని కార్యక్రమం ద్వారా సందేశాన్ని అందించారు. అలాగే, మానసిక ఆరోగ్య సమస్యలు, ఒత్తిడి, ఆందోళన, నిరాశ లేదా ఆత్మహత్య ఆలోచనలతో బాధపడుతున్న వారు తక్షణ సహాయం కోసం టెలి-మానస్, టోల్‌ఫ్రీ నంబర్ 14416ను సంప్రదించవచ్చని ప్రజలకు తెలియజేశారు. ఈ సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేసేందుకు 14416 నంబర్‌తో కూడిన అవగాహన బ్యానర్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సైకియాట్రిస్ట్ డా. అఖిలేంద్ర శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ డా. అనుగ్య, సైకాలజిస్ట్ చంద్రబోస్, సైకియాట్రిక్ నర్స్ ప్రియాంక రాయ్, హెల్త్ సూపర్‌వైజర్ భవానితో పాటు కంబాలపేట యూపీహెచ్సీ వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. "ఆత్మహత్యలను నివారించడం సాధ్యమే. ఒకరి మాట వినడం, వారికి అండగా నిలవడం, సరైన సమయంలో సహాయం అందించడం ద్వారా ఒక ప్రాణాన్ని కాపాడవచ్చు" అనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందించారు.












### చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో రావులపాలెంలో

# ఘనంగా వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం

**కోనసీమలో వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే వెన్నెముక : బొత్స సత్యనారాయణ**

**స్థానిక సంస్థల ఎన్నికలకు శ్రేణులు సమరశంఖం పూరించాలి**

**ప్రజా వ్యతిరేక కూటమి పాలనను ఎండగట్టేందుకు 'వెన్నుపోటు పార్టీ.. వెన్నుపోటు పాలన' కార్యక్రమం**






**రావులపాలెం, సెప్టెంబర్ 8, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో రావులపాలెం సీఆర్‌సీ నందు ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా శాసన మండలి ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే అసలైన బలం, బలగమని అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజలకు అండగా నిలుస్తున్న పార్టీ శ్రేణుల కృషిని అభినందించారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్తపై ఉందని సూచించారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. పార్టీ ముఖ్య నాయకులకు బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా వైఎస్సార్‌సీపీ ఐడెంటిటీ కార్డులను అందజేశారు. పార్టీకి సంబంధించిన కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తల గుర్తింపును మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రతి స్థాయి నాయకుడు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేలా కార్యాచరణ రూపొందించాలని సమావేశంలో సూచించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యం, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. 'వెన్నుపోటు పార్టీ.. వెన్నుపోటు పాలన' కార్యక్రమం ద్వారా గతంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రస్తుత ప్రభుత్వ పాలన మధ్య ఉన్న వ్యత్యాసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు వివరించారు. గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి వరకు కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని పిలుపునిచ్చారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సమన్వయంతో పనిచేయాలని బొత్స సత్యనారాయణ సూచించారు. గ్రామస్థాయిలో పార్టీకి బలమైన పునాది ఉన్నందున నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగితే వైఎస్సార్‌సీపీకి మరింత ప్రజాబలం లభిస్తుందని అన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుని, ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలందరూ సమష్టిగా పనిచేయాలని అన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయడంతో పాటు, గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయాలని నాయకులకు సూచించారు. రాబోయే రోజుల్లో పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అమలాపురం పార్లమెంటరీ పరిశీలకురాలు, పీఏసీ సభ్యులు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ కోఆర్డినేటర్లు, సీఈసీ సభ్యులు, రాష్ట్ర కార్యదర్శులు, ఎస్ఈసీ సభ్యులు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వివిధ పదవుల్లో ఉన్న ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల భారీ హాజరుతో రావులపాలెం సీఆర్‌సీ ప్రాంగణం పార్టీ శ్రేణుల నినాదాలతో సందడిగా మారింది. సమావేశం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.

### వంగవీటి మోహన రంగా విగ్రహావిష్కరణలో

# పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**రావులపాలెం, సెప్టెంబర్ 8, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒకే ఒకసారి ఎమ్మెల్యేగా ఎన్నికైనా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు వంగవీటి మోహనరంగా అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రశంసించారు. రావులపాలెం మండలం పొడగట్లపల్లి శివారు జనిపిరెడ్డిపాడు లో నూతనంగా ఏర్పాటు చేసిన వంగవీటి మోహన్ రంగా విగ్రహాన్ని ఆయన, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, ఆకుల రామకృష్ణ తో కలిసి ఆవిష్కరించారు.

# విద్యార్థినులకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన






**అమలాపురం, సెప్టెంబర్ 8, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సినేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాధాన్యత, ప్రయోజనాలపై విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ సాయి స్రవంతి, అల్లు అర్జున్ సన్నిహితుడు ధర్మేంద్ర, ఛాంబర్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, పాఠశాల ప్రిన్సిపాల్ విజయకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయి స్రవంతి మాట్లాడుతూ విద్యార్థినులు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వైద్యుల సూచనల మేరకు వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా హెచ్‌పీవీ సంబంధిత వ్యాధుల నివారణలో ప్రయోజనం ఉంటుందని వివరించారు. వ్యాక్సిన్‌పై ఉన్న అపోహలను వీడి, తల్లిదండ్రులు కూడా పిల్లల ఆరోగ్యంపై అవగాహనతో నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు పోలిశెట్టి రాము, కొమ్ముల మూర్తి, షేక్ బషీర్, శృంగవరపు దుర్గాప్రసాద్, గోపి వంశీ, మంగలంపల్లి ప్రదీప్, గారపాటి శ్రీను, కుంచె మోహన్, అడపా నాయుడు, చిక్కల శేషు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినులు కార్యక్రమంలో ఆసక్తిగా పాల్గొని హెచ్‌పీవీ వ్యాక్సిన్‌కు సంబంధించిన పలు అంశాలను తెలుసుకున్నారు.

# రామచంద్రపురంలో ఫిజియోథెరపీ అవగాహన శిబిరం, 2కే రన్




**రామచంద్రపురం, సెప్టెంబర్ 8, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణంలోని కృతివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా రాజరత్న కాలేజీ ఫిజియోథెరపీ అండ్ రిహాబిలిటేషన్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, చికిత్స శిబిరం, 2కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న యోగ వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు తొగరు మూర్తి మాట్లాడుతూ, ఫిజియోథెరపీపై అవగాహన లేకపోవడం వల్ల చాలామంది అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని తెలిపారు. నొప్పులు, గాయాలు లేదా వ్యాధుల వల్ల ఎముకలు, కండరాలు, నరాలకు హాని కలిగితే వాటిని సరిచేసి పునరావాసం కల్పించే ప్రత్యేక విభాగమే ఫిజియోథెరపీ అని వివరించారు. క్రీడల్లో గాయపడిన యువతీయువకులను పట్టణంలోని సెంటర్‌కు పంపిస్తున్నామని, డాక్టర్ పద్మజ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. రామచంద్రపురం పరిసర ప్రాంతాల ప్రజలు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ ఇంద్రజ మాట్లాడుతూ, ఫిజియోథెరపీ అంటే కేవలం ఆర్థోపెడిక్ వైద్యం మాత్రమే అనే అపోహ ఉందని, అయితే మహిళల ఆరోగ్యం, గర్భిణులు, పసిపిల్లలకు సంబంధించిన సమస్యలను సైతం సర్జరీలు లేకుండా దీని ద్వారా నయం చేయవచ్చని స్పష్టం చేశారు. అనంతరం డాక్టర్ పద్మజ ప్రజలు అడిగిన పలు ప్రశ్నలు, సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కృతివెంటి పేర్రాజు పంతులు ట్రస్ట్ చైర్మన్ నాయుడు మాస్టర్, యోగ గురువు అబ్బులు, ఏరియా హాస్పిటల్ ఇన్‌ఛార్జి గొల్లపల్లి కృష్ణ, బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రతినిధి గణేష్, కిట్స్ కళాశాల డైరెక్టర్ ఎన్.వి. పవన్ కుమార్, కె.రామారావు, ఏ.ఎన్.వి రవితేజ, ఎం. శ్రీకాంత్, విద్యార్థులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ ద్వారానే గణేష్ మండపాలకు అనుమతులు

**రామచంద్రపురంలో ఉత్సవ కమిటీ సమావేశం**



**రామచంద్రపురం, సెప్టెంబర్ 8, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలోని శివాలయ ప్రాంగణంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 7న నియోజకవర్గ గణపతి ఉత్సవ కమిటీ సమావేశం జరిగింది. కాకినాడ ఖండ కార్యదర్శి తుమ్మలపల్లి నాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రామచంద్రపురం డీఎస్పీ శేషు, ఎస్ఐ నాగేశ్వరరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ నెల 14వ తేదీ నుంచి జరగనున్న గణపతి నవరాత్రి మహోత్సవాలకు మండప నిర్వాహకులు తప్పనిసరిగా సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్ ద్వారా అనుమతులు తీసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తి భావనతో సాంప్రదాయ గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించాలని, పందిళ్ల వద్ద సినిమా పాటలు, డీజేలు ఏర్పాటు చేసి హిందూ ధర్మాన్ని అవహేళన చేయవద్దని సూచించారు. నవరాత్రులను పూర్తిగా భక్తి వాతావరణంలో నిర్వహించుకోవాలని, నిమజ్జన సమయంలో సాంప్రదాయ పద్ధతుల్లో కోలాటం, భజన కార్యక్రమాల నడుమ విగ్రహాలను ఊరేగించాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో శివాలయం ట్రస్టు చైర్మన్ చెరుకుపల్లి గణేష్ శర్మ, బాల భక్త సమాజం, రైస్‌పేట లక్ష్మీ గణపతి ఆలయ ప్రతినిధులు, వివిధ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**ఫిజియోథెరపీ సేవల విస్తరణకు "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అండ"**

**రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో ఘనంగా ప్రపంచ ఫిజియోథెరపీ డే వేడుకలు**



**రామచంద్రపురం, సెప్టెంబర్ 8, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ ఫిజియోథెరపీ డే సందర్భంగా రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం హాజరై కేక్ కట్ చేసి వైద్యులు, ఫిజియోథెరపిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ఆధునిక వైద్య రంగంలో ఫిజియోథెరపీకి ప్రత్యేక స్థానం ఉందన్నారు. అనేక రకాల కండరాలు, నరాలు, కీళ్ల సంబంధిత సమస్యలను ఎలాంటి మందులు వినియోగించకుండా ఫిజియోథెరపీ ద్వారా సమర్థవంతంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రమాదాలు, పక్షవాతం, వెన్నునొప్పి, కీళ్ల నొప్పులు వంటి సమస్యల నుంచి రోగులు త్వరగా కోలుకునేందుకు ఫిజియోథెరపీ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలోని ఫిజియోథెరపీ యూనిట్‌కు అవసరమైన పరికరాలను సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అలాగే రూ.16 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డయాలసిస్ యూనిట్‌ను త్వరలోనే ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషితో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి అభివృద్ధి చెందుతోందని, నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి జరుగుతోందని తెలిపారు. సీఎస్ఆర్ నిధులను నియోజకవర్గానికి తీసుకువచ్చి ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు తదితర రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్, గొల్లపల్లి కృష్ణ, కంచుమర్తి బాబురావు, డాక్టర్ కె. హేమంత్ చక్రధర్ (ఆర్ఎంఓ), డాక్టర్ ఓ. ప్రసన్న, డాక్టర్ ఎం.బి. లోకనాథ్, డాక్టర్ మోహన్ బాబు, డాక్టర్ మౌనిక, డాక్టర్ సుష్మిత, నర్సింగ్ సూపరింటెండెంట్ జయప్రద, ఎం. చంద్రావతి (ఫార్మసీ సూపర్వైజర్), బి. మేఘన (ఫిజియోథెరపిస్ట్), ఎం. సాయి లక్ష్మి (ఫిజియోథెరపిస్ట్), ప్రసాద్ (బయోమెడికల్ ఇంజనీర్) తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల ద్రాక్షారామంలో ఏపీఎన్జీవో సంబరాలు



**ద్రాక్షారామ, సెప్టెంబర్ 8, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్రాక్షారామ గ్రామపంచాయతీలో ఈరోజు ఏపీఎన్జీవో సంఘం రామచంద్రపురం తాలూకా శాఖ అధ్యక్షుడు పెట్టా సత్యనారాయణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత ఉద్యోగుల కోర్కెల పట్ల సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, రాష్ట్ర ఏపీఎన్జీవో అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్, కార్యదర్శి డి.వి రమణలకు కృతజ్ఞతలు తెలుపుతూ కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏపీఎన్జీవో సంఘం అధ్యక్షుడు మాధవరపు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు చిక్కాల సూర్యారావు, రామచంద్రపురం తాలూకా శాఖ కార్యదర్శి నయనాల శ్రీనివాసరావు, కోశాధికారి మాధవరపు కాశీవిశ్వేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులు అశోక్, వెంకట్రావు, మహిళా నాయకులు శైలజ, శిరీష, నందిని, మాణిక్యాంబా, భవాని, అరుణలతో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.



# క్రమశిక్షణే యువత విజయానికి నాంది

**యువత సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి**
**యువత భవిష్యత్తుపై దృష్టి సారించాలి - జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**



**కాకినాడ, సెప్టెంబర్ 8, విశ్వం వాయిస్ న్యూస్ :** జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు క్రమశిక్షణ, కష్టపడి చదవడం ఎంతో ముఖ్యమని,యువత సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ సానుకూల సానుకూల దృక్పథంతో లక్ష్యాలపై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపు నిచ్చారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ,జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమన్వయంతో మంగళవారం కాకినాడ స్మార్ట్ సిటీ సమావేశ మందిరం లో 'యువ, సఖి' గ్రూప్ లీడర్ల కు జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.'పిల్లలే దేశ సంపద వారి భద్రతే మన బాధ్యత' అనే నినాదంతో ఒత్తిడి నిర్వహణ, భావోద్వేగ నియంత్రణ, సైబర్ భద్రత బాలల పరిరక్షణ అంశాలపై ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి సూర్యనారాయణ రాజు, సభ్యులు గంగా సూర్య నారాయణ, శిశు సంక్షేమ సమితి (సీడబ్ల్యూసీ) చైర్‌పర్సన్ గంట సత్యనారాయణ, జిల్లా విద్యాధికారి పి. రమేష్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జె.రాంబాబు తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేసి యువతకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ జీవితం లో ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి ఎదిగి విజయం సాధించాలనే కోరుకుంటారని,అయితే కోరుకోవడంతో ఆగిపోకుండా దానికోసం తగిన కృషి చేయాలని తెలిపారు.వ్యక్తిగత జీవితంలో విజయం సాధించడానికి అత్యంత కీలకమైన ఏకైక గుణం 'క్రమశిక్షణ'అని, ప్రేరణ తాత్కాలికమని,ఏ రంగం లోనైనా క్రమశిక్షణతో కూడిన నిరంతర కృషి ఉంటేనే సఫలత సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. యువత తమ శక్తిని సామాజిక మార్పు కోసం సానుకూలంగా ఉపయోగించు కోవాలని పిలుపు నిచ్చారు. సామాజిక మాధ్యమాలు, మత్తు పదార్థాల వల్ల ఎదురవుతున్న ముప్పుపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్,ఉన్నత చదువుల ప్రవేశ పరీక్షల వంటి ప్రతి రంగంలోనూ తీవ్రమైన పోటీ ఉంటుందని, కనీసం రోజులో 8 గంటలు కష్టపడి చదివే వారే విజయంసాధిస్తారని తెలిపారు.కష్టపడి చదువుకోకపోతే జీవితంలో ఎంతగానో ఇబ్బంది అవుతుందన్నారు. బాల్య వివాహాలు సమాజానికి శాపమని, గోదావరి జిల్లాలలో కూడా ఇలాంటి ఘటనలు జరగడం మారాలని జిల్లా కలెక్టర్ అన్నారు. చదువే ఆడపిల్లలకు నిజమైన రక్షణ అని,చదువుకుంటే బాల్య వివాహాల వంటి దురా చారాలను అరికట్టవచ్చని తెలిపారు.బాల్య వివాహాల నియంత్రణ కోసం ఎవరైనా 1098 నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించవచ్చని చెప్పారు. యువాన్ సఖీ' గ్రూపు సభ్యులుగా విద్యార్థులు తమ తోటి వారికి మంచి మార్గదర్శనం చేయాలని, మత్తు పదార్థాల బారిన పడుతున్న తమ తోటి విద్యార్థులను సన్మార్గంలో నడిపించేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఏపీఎస్సీపీఆర్సీ చైర్మన్ వేటుకూరి సూర్యనారాయణ రాజు రాష్ట్ర బాలల హక్కుల పరి రక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరిసూర్యనారాయణ రాజు మాట్లాడుతూ కేవలం చదువు మాత్రమే కాకుండా విద్యార్థులలో మంచి నడవడిక, సంస్కారం,దేశభక్తి పెంపొందాలని పిలుపు నిచ్చారు.విద్యార్థులు షార్ట్ కట్ మార్గాలను ఎంచుకోకుండా కష్టపడితేనే జీవితంలో విజయం సాధించగలరని,పర్యావరణ పరిరక్షణ, కుటుంబ విలువలు ,మాతృభాషాభిమానం,స్వదేశీ వస్తువుల వాడకం పౌర విధులను పాటించడం అనే ఐదు ముఖ్యమైన అంశాల పై శ్రద్ధ పెట్టాలని కోరారు. అలాగే బాల్య వివాహాలు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరిలో మార్పు రావాలని సూచిస్తూ,ఆపదలో ఉన్న పిల్లల సహాయం కోసం చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 ను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.కాలాన్ని వృథా చేయకుండా లక్ష్యం వైపు అడుగులు వేయండి సీడబ్ల్యూసీ చైర్మన్ డా. గంటా సత్యనారాయణ ఈ సందర్భంగా జిల్లా సీడబ్ల్యూసీ చైర్మన్ డా. గంటా సత్యనారాయణ మాట్లాడుతూ కాకినాడ జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారిగా ఏర్పాటైన చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ) ద్వారా చిన్నారుల సంరక్షణ కు పూర్తి స్థాయి చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు, యువత తమ విలువైన సమయాన్ని సోషల్ మీడియా,మొబైల్ ఫోన్ల వంటి డిస్ట్రాక్షన్స్ వైపు మళ్లించకుండా,భవిష్యత్తు పై దృష్టి పెట్టాలని పిలుపు నిచ్చారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలంటే యువత కొద్ది కాలం పాటు కష్టపడి చదవాలని, కాలాన్ని వృథా చేయకుండా లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలని హితవు పలికారు. విశాఖ జిల్లాలో జరిగిన సంఘటనలో నాలుగు సంవత్సరాల వయసులో తండ్రి చనిపోగా, మొదటి కోవిడ్ సీజన్ లో తల్లి కూడా చనిపోయి నప్పటికీ, కేజీబీవీ తొండంగిలో చదువుకుని, పట్టుదలతో నీట్ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించి, రాజమండ్రి ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు పొందిన కాజులూరుకు చెందిన కె. జానకి రత్నప్రభను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఇతర గౌరవ అతిథులు ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సీహెచ్ లక్ష్మి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి వెంకటరావు, ఈగల్ టీం సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు, సీడీపీవోలు ఇతర అధికారుల తదితరులు పాల్గొన్నారు

# మన గ్రామం - మన బాధ్యత

**గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి అందరూ కృషి చేయాలి : జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్**



**కాకినాడ, సెప్టెంబర్ 8, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన గ్రామం మన బాధ్యత' కార్యక్రమాన్ని ఇకపై ప్రతి నెల మూడో బుధవారం నిర్వహిస్తూ జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసి గ్రామాల సర్వతోము ఖాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ మండల స్థాయి వరకు వివిధ శాఖల అధికారులతో నిర్వహించి మన గ్రామం మన బాధ్యత పై దిశా నిర్దేశం చేస్తూ స్పష్టమైన మార్గదర్శకాలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ప్రతినెలా మూడో బుధవారం అనగా ఈ నెల 23వ తేదీ నుండి ప్రారంభించాలని సూచిం చారు.గ్రామస్థాయి లో పంచాయతీ ఒక యూనిట్ గా పరిపాలన జరగాలన్నదే ప్రభుత్వ సంకల్పం అని తెలిపారు.ప్రతి నెల రెండో బుధవారం ప్రిపరేటరీ కార్యక్రమాన్ని నిర్వహించు కుని మూడవ బుధవారం పకడ్బందీగా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ గ్రామ స్వరాజ్య పాలన దిశగా ముందడుగు వేయాలన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో పంచాయతీ ల ప్రత్యేక అధికారులు కీలక పాత్ర పోషించాలని అదే విధంగా పంచాయతీ కార్యదర్శులు మీటింగ్ కన్వీనర్లుగా వ్యవహరిస్తూ గ్రామస్థాయిలో అన్ని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ కుమారి ప్రియా శాఖల వారీగా మన గ్రామం మన బాధ్యత కార్యక్రమం పై స్పష్టమైన మార్గదర్శకాలు రూపొం దించడం జరిగిందని వాటిని ఆయా శాఖలకు సమర్పించడం జరుగు తుందన్నారు.గ్రామ స్థాయి లో ప్రతి పౌరుడు తమ తమ సమస్యలపై ఈ సమా వేశంలోచర్చించి పరిష్కరించు కోవాలనే భావనతో ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసినట్లు తెలిపారు. శాఖల వారీగా గ్రామంలో స్థితిగతులపై సమగ్రమైన అధ్యయనం చేస్తూ ఆయా నివేదికలను మన గ్రామం మన బాధ్యత సమావేశం లో చర్చించి గ్రామాలు స్వపరిపాలన సాధించే దిశగా కృషి చేయాలన్నా రు.గ్రామాలలో సుపరిపాలన అందించే దిశగా ప్రభుత్వం మరో ముందడుగు వేసిందన్నారు.పారిశుధ్యం, ప్రజారోగ్యం, విద్య, మహిళా శిశు సంక్షేమం, సురక్షిత తాగునీటి సరఫరా రంగాలలో మెరుగైన ఫలితాలు సాధించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. స్థానిక సంస్థలు ఎన్నికల అనంతరం సర్పంచులే వీటి బాధ్యతలునిర్వహిస్తారన్నారు. ఏఎన్ఎం, ఆశా ఎమ్ఎస్‌కే గ్రామ పంచాయతీలో హోమ్ సర్వే నిర్వహించి ప్రస్తుత స్థితిగతులపై నివేదిక రూపొందించాలన్నారు. వీటిని సమావేశంలో చర్చించి మినిట్స్ రూపొందించి తదుపరి మీటింగ్ మినిట్స్‌పై తీసుకున్న చర్యలను సమీక్షించాలన్నారు. పంచాయతీ ప్రత్యేక అధి కారులు గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను ప్రతిరోజూ పర్యవేక్షించి,చెత్త సేకరణ, తడి పొడి చెత్త వేరు చేయడం, డ్రైనేజీల శుభ్రత సక్రమంగా జరిగేలా చూడాలన్నారు.తాగునీటి వనరులు, సరఫరా వ్యవస్థ ను తనిఖీ చేసి,నీటి నాణ్యత, క్లోరినేషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించడం తో పాటు గ్రామ అభివృద్ధి కార్యా చరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలన్నారు. అన్ని శాఖల మధ్య సమన్వయం సాధించి కార్యక్రమాన్ని నిర్దేశించిన లక్ష్యాల మేరకు అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం, ప్రీ స్కూల్ విద్య, ఆరోగ్య సేవలను పర్యవేక్షించాలన్నారు. రక్తహీనత, పోషకాహార లోపం తదితర సమస్యలపై అవగాహన కార్యక్రమాలు సమగ్రంగా చేపట్టాలన్నారు. బాల్య వివాహాల నివారణ, బాలల హక్కులు, మహిళల భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందాల్సిన పోషకాహారం ప్రభుత్వ సంక్షేమ సేవలు సకాలంలో అందేలాచర్యలు తీసు కోవాలన్నారు. మధ్యాహ్నబడి భోజనాన్ని సక్రమంగా అమలు చేయాలని డ్రాప్‌అవుట్ విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పంచాయతీ అధి కారులు, గ్రామ పంచాయతీ ల్లో 'మన గ్రామం మన బాధ్యత' కార్యక్రమం అమలు తీరును సమగ్రంగా పర్యవేక్షించాలన్నారు.పంచాయతీ ప్రత్యేక అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు, సాంకేతిక సహకారం అందించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.గ్రామ పంచాయతీల పనితీరును సమీక్షిస్తూ లోపాలను గుర్తించి తక్షణమే సరిదిద్దే లా చర్యలు తీసుకోవాల న్నారు. గ్రామాల అభివృద్ధికి సంబంధించిన వివిధ శాఖల కార్యక్రమాలను సమన్వయం చేయాలన్నారు. పి.హెచ్.సి. వైద్యులు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు,డెంగ్యూ, మలేరియా తదితర దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వ హించి అవసరమైన మందులుఅందించాలన్నారు. గర్భిణులు,బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిస్థితి ని పర్యవేక్షించాలన్నారు. టీకాల కార్యక్రమం, తల్లి శిశు ఆరోగ్య సేవలు సకాలంలో అందుతు న్నాయో లేదో పరిశీ లించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, దోమల నివారణ, సురక్షిత తాగునీరు, పోషకాహారంపై ప్రజలకు అవ గాహన కల్పించాలన్నారు. డి.ఆర్.డి.ఎ.వారు గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత కు స్వయం సహాయక సంఘాలను కార్యక్రమంలో చురుకుగా భాగస్వామ్యం చేయాలన్నారు. గ్రామీణ జీవనో పాధిఅవకాశాలను పెంపొం దించే కార్యక్రమాలను ప్రోత్సహించాలన్నారు. మహిళా సంఘాల ద్వారా పరిశుభ్రత, స్వయం ఉపాధి, జీవనోపాదులు మెరుగు పరచాలన్నారు. ప్రజా భాగస్వామ్యంతోనే మన గ్రామం మన బాధ్యత సాధ్యమవుతుందని ఈ కార్యక్రమం కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజాప్రతి నిధులు, యువత, విద్యార్థులు, మహిళా సంఘాలు స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్ర మంలో చురుగ్గా పాల్గొని తమ గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని పిలుపు నిచ్చా రు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించ కుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయు తంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి జి.శ్రీనివాసరావు, డిఎంఅండ్ హెచ్ఓ, కే.అనిత, ఐసిడిఎస్, పిడిసిహెచ్ లక్ష్మి, డిఈఓ పి.రమేష్ తదితరులు, పాల్గొన్నారు.

# జర్నలిస్టుల అరెస్టుపై ఏపీజెఎఫ్ ఆగ్రహం

**నంద్యాల ఐ న్యూస్ రిపోర్టర్లను బేషరతుగా విడుదల చేయాలి**
**నచ్చని వార్తలపై చట్టపరమైన మార్గాలను ఆశ్రయించాలి..**
**అర్ధరాత్రి అదుపులోకి తీసుకోవడం సరికాదు**
**సీఎం, డీజీపీ తక్షణమే స్పందించాలి.. అక్రమ కేసులు ఎత్తివేయాలి: ఏపీజేఎఫ్ నాయకులు**




**కాకినాడ, సెప్టెంబర్ 8, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర మంత్రి ఫరూఖ్ కుమా రులపై ఐ న్యూస్ చానల్‌లో ప్రసారమైన కథనాలకు సంబంధించి నంద్యాల ఐ న్యూస్ రిపోర్టర్లను అరెస్టు చేయడాన్ని కాకినాడ జిల్లా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు, ఏపీజెఎఫ్ నాయకులు వీధి సాయినాథ్, రెడ్డిపల్లి రాజేశ్ తీవ్రంగా ఖండించారు. నంద్యాలలో జరుగుతున్న పరిణామాలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లే క్రమంలో ఐ న్యూస్ రిపోర్టర్లు ప్రసారం చేసిన కథనాలపై అభ్యంతరాలు ఉంటే ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేయవచ్చని వారు తెలిపారు. వార్తల్లో వాస్తవాలు లేవని భావిస్తే ఖండన ఇవ్వడంతో పాటు చట్టపరమైన మార్గాలను ఆశ్రయించవచ్చన్నారు. అయితే జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులకు పాల్పడటం, కేసులు నమోదు చేసి అర్ధరాత్రి అదుపులోకి తీసుకోవడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసే మీడియా వ్యవస్థలోని లోపాలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై ఒత్తిళ్లు తీసుకురావడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. అధికార పార్టీ నేతల అండతోనే జర్నలిస్టులపై కేసులు నమోదు చేసి, వారిని అదుపులోకి తీసుకున్నారనే ఆరోపణలపై ప్రభుత్వం సమగ్రంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. అర్ధరాత్రి జర్నలిస్టులను అదుపులోకి తీసుకున్నప్పటికీ ఇప్పటి వరకు అరెస్టును అధికారికంగా చూపించకపోవడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, మీడియా స్వేచ్ఛను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డీజీపీ తక్షణమే స్పందించి అరెస్టు చేసిన నంద్యాల ఐ న్యూస్ జర్నలిస్టులను బేషరతుగా విడుదల చేయాలని, వారిపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని ఏపీజేఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై ఒత్తిళ్లు, బెదిరింపులు, అక్రమ కేసుల ప్రక్రియ కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మీడియా స్వేచ్ఛను, జర్నలిస్టుల భద్రతను కాపాడేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఈ నెల 12న దళిత ఆత్మీయ సమ్మేళనం

**అతిథులుగా మాజీ మంత్రి యనమల, ఎమ్మెల్యే దివ్య**



**కోటనందూరు, సెప్టెంబర్ 8, విశ్వం వాయిస్ న్యూస్ :** దళితుల ఆర్థిక స్వావలం బన లక్ష్యంగా ప్రభు త్వ విఫ్ యనమల దివ్య నాయకత్వం లో తుని నియోజక వర్గ బహుజనులు అభివృద్ధి పథంలో నడుస్తున్నారు. సామాజిక, ఆర్థిక రాజకీయ పరంగా అన్ని విధాలా ప్రోత్సహిస్తున్న యనమల వెంట నడిచేందుకు దళితులందరూ ఒకే మాటపై నిలిచారు.కూటమి ప్రభుత్వ సహాయసహకారాలు అందిపుచ్చుకుంటున్న దళితులు ఈనెల 12వ తేదీన నియోజకవర్గ స్థాయి దళిత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని తుని కూటమి కార్యాలయంలో ఈరోజు ఉదయ సమావేశమైన దళిత సోదరులు నిర్ణయించారు.అనంతరం సాయంత్రం తేటగుంట క్యాంప్ కార్యాలయంలో మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడితో సమావేశమైన దళిత సోదరులు తుని కూటమి కార్యాలయంలో సమావేమై తీసుకున్న నిర్ణయాన్ని తెలియజేసారు. దళిత సోదరుల నేతల నిర్ణయాన్ని యనమల స్వాగతించారు. బహుజనుల ఆహ్వానాన్ని అంగీకరించిన యనమల సభా వేదిక తేటగుంట క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుకు సానుకూలత వ్యక్తం చేసారు. ఈనెల 12 వతేదీన క్యాంప్ కార్యాలయంలో జరిగే దళిత ఆత్మీయ సమ్మేళానికి ముఖ్య అతిథులుగా మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ విఫ్ యనమల దివ్య హాజరు కానున్నారు.

# గ్రీన్ క్లైమేట్ ఫండ్ ప్రాజెక్ట్ పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష



**కాకినాడ, సెప్టెంబర్ 8, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో గ్రీన్ క్లైమేట్ ఫండ్(జీసీఎఫ్) ఆధ్వర్యంలో ఈ.సి.ఆర్.ఐ.సి.సి (ఈసీఆర్ఐసీసీ) ప్రాజెక్ట్ ద్వారా తీరప్రాంత ప్రజలలో వాతావరణ మార్పులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలపై మంగళవారం కాకినాడ కలెక్టరేట్ లో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రాజెక్ట్ బృందం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో మడ అడవుల(మ్యాంగ్రూవ్) పునరుద్ధరణ, పర్యావరణ వ్యవస్థల పరిరక్షణ తీర ప్రాంత ప్రజల కోసం ప్రతిపాదిత జీవనోపాధి కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు.ముఖ్యంగా అలంకార చేపల పెంపకం, సముద్రపు నాచు (సీవీడ్) సాగు, సముద్రంలో కేజ్ కల్చర్, ఫిన్‌ఫిష్ పెంపకం వంటి ప్రత్యామ్నాయ ఉపాధి యూనిట్ల ఏర్పాటుపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిపాదిత కార్యక్రమాలను సంబంధిత శాఖల మధ్య సమర్థవంత మైన సమన్వయంతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. ప్రస్తుత సంవత్సరం లో పనులను మరింత వేగవంతం చేయాలని, స్పష్టమైన లక్ష్యాలు, నిర్దిష్ట ప్రాంతాలు, బాధ్యతలు, కాలపరిమితితో కూడిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను వెంటనే సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కాకినాడ జిల్లా లో తీరప్రాంత పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించడం,స్థానిక ప్రజలకు సుస్థిర జీవనోపాధి అవకాశాలను కల్పించడం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేలా తీర ప్రాంత సమాజాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం, జీసీఎఫ్ ఈసీఆర్ఐసీసీ బృందం సంయుక్తంగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో యు.ఎన్.డీ.పీ ఇండియా ప్రోగ్రాం యనలిస్ట్ రాజత్ చౌదరి, స్టేట్ ప్రాజెక్ట్ అసోసియేషన్ రవికుమార్, రాష్ట్ర ప్రాజెక్ట్ మేనేజర్ సత్య శర్మ, జిల్లా కోఆర్డినేటర్ ఎల్.శ్రీహర్ష బృందంలోని ఇతర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.






**గోకవరం, సెప్టెంబర్ 8, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతానికి ముఖద్వారంగా పేరుగాంచిన గోకవరం మండలంలో రాజకీయ చర్చలు ఆసక్తికరంగా మారుతున్నాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, గోకవరం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉన్న స్థానిక నాయకుడి గురించి ప్రజల్లో ఇప్పటికే చర్చ మొదలైంది. గోకవరం మండలానికి చెందిన వ్యక్తి ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలో ప్రాతినిధ్యం వహించాలని స్థానికులు ఎప్పటి నుంచో ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. మండలంలోని గ్రామాల సమస్యలు, ఏజెన్సీ సరిహద్దు ప్రాంతాల అవసరాలు, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం వంటి అంశాలపై పూర్తిస్థాయి అవగాహన ఉన్న స్థానిక వ్యక్తి ప్రజాప్రతినిధిగా ఉంటే అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందనే అభిప్రాయం వినిపిస్తోంది. ఇప్పటికే గత ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిత్వంపై పలువురు ప్రయత్నాలు చేసినప్పటికీ, ఈసారి పరిస్థితులు భిన్నంగా ఉండవచ్చన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఒక వ్యక్తి క్రమంగా సిద్ధమవుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన పేరు బహిరంగంగా చర్చకు రాకపోయినా, గోకవరం మండలంలోని అనేక గ్రామాల్లో ఆయన రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తికరమైన చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. "ఆ వ్యక్తి అసెంబ్లీకి వెళితే గోకవరం మండలంతో పాటు పరిసర ప్రాంతాలు, గ్రామాల అభివృద్ధికి కొత్త దిశ ఏర్పడుతుందా?" అనే ప్రశ్నపై ప్రజల్లో చర్చ సాగుతోంది. ప్రజల సమస్యలను దగ్గర నుంచి తెలుసుకునే, అందరికీ అందుబాటులో ఉండే, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కోసం పనిచేసే నాయకత్వం అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే ఎన్నికలు సమీపించినప్పుడు మాత్రమే ప్రజల వద్దకు వచ్చే నాయకత్వం కంటే, అన్ని కాలాల్లో ప్రజల సమస్యల కోసం పనిచేసే వ్యక్తికే రాజకీయ అవకాశాలు రావాలని కొందరు బహిరంగంగానే అంటున్నారు. "ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ మనదే" అన్నట్లుగా రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీలు మారే నేతలపై కూడా ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోందన్న చర్చ ఉంది. ప్రజల విశ్వాసాన్ని కాపాడని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాజకీయాలను ఉపయోగించుకునే వారిపై పార్టీలు కూడా కఠినంగా వ్యవహరించాలని కొందరు కోరుతున్నారు. ప్రజల యోగక్షేమాలను నిజంగా కోరుకునే వ్యక్తులే రాజకీయాల్లోకి రావాలని, ప్రజాసేవే ప్రధాన లక్ష్యంగా పనిచేసే నాయకత్వం అవసరమని గోకవరం మండలంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. అలాంటి వ్యక్తులు ప్రజాప్రతినిధులుగా ఎన్నికైతేనే గ్రామీణ ప్రాంతాల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు లభిస్తాయని పలువురు భావిస్తున్నారు. మరి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గోకవరం నుంచి నిజంగానే ఒక బలమైన స్థానిక అభ్యర్థి రంగంలోకి దిగుతారా? ప్రజలు ఆశగా చూస్తున్న ఆ వ్యక్తి ఎవరు? ఏ రాజకీయ పార్టీ నుంచి పోటీ చేస్తారు? లేక స్వతంత్రంగా రాజకీయ అడుగులు వేస్తారా? అన్న ప్రశ్నలు ఇప్పుడు గోకవరం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఏది ఏమైనా, ఎన్నికలకు ముందే గోకవరం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిత్వంపై మొదలైన ఈ చర్చ రానున్న రోజుల్లో మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.

చిన్నారి అత్యవసర వైద్య చికిత్సకు సిఎం సహాయ నిధి ద్వారా

## ఎల్ఓసి రూ.1,50,602/- అందజేసిన ఎమ్మెల్యే బత్తుల



**సీతానగరం, సెప్టెంబర్ 8, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం చిన్నకొండెపూడి గ్రామానికి చెందిన ముదునూరి చిన్నారి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుం డటంతో, ఆసుపత్రి వైద్య ఖర్చుల నిమిత్తం కుటుంబసభ్యులు ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రత్యేక చొరవ చూపి చిన్నారి అత్యవసర వైద్య చికిత్స కు ప్రభుత్వం నుండి తక్షణమే రూ.1,50,602/లు మంజూరు చేయించారు. నేడు ఆ ఎల్.ఓ.సి పత్రాన్ని చిన్నారి కుటుంబసభ్యులకు అందజేసి, చిన్నారి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సమయానికి స్పందించి ఆసుపత్రి చికిత్సకు ఎల్.ఓ.సి అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు చిన్నారి కుటుంబసభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలు ఆదరించేది వైసీపీ ప్రభుత్వాన్నే..

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



**సీతానగరం, సెప్టెంబర్ 8, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతీ గ్రామాల్లో ఉన్న సంస్దాగత కమిటీ లు బలోపేతానికి అందరూ కృషి చేయాలని రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కార్యకర్తలకు పిలుపు ఇచ్చారు. మంగళవారం నాడు మండలంలోని కాటవరం గ్రామంలో వైకాపా మండల కో కన్వీనర్ కరుటూరి హరిబాబు ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సంస్దాగత నిర్మాణాల కార్యకర్తల సమావేశంలో జక్కంపూడి రాజా మాట్లాడుతూ ,ప్రతీ విభాగంలో నుండి ప్రతిభగల నాయకత్వం ఉన్న కార్యకర్తలను ఎన్నుకొంటామని పెర్కొన్నారు. సోషల్ మీడియా, సేవాదళ్ బలోపేతానికి కృషి చేయాలన్నారు. స్దానికసంస్థల కు ప్రతీ కార్యకర్త సంసిద్ధత కావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అమలు కానీ హామీలిచ్చి దొడ్డిదారిన అధికారం లోకి వచ్చిందన్నారు. ప్రభుత్వం పై తీవ్రరేకత ఉందని తెలిపారు. మహిళలకు 1500 రూపాయిలు ,నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేసారని మండిపడ్డారు. ఈసందర్భంగా కరుటూరి హరిబాబు మాట్లాడుతూ, స్దానికసంస్థల్లో వైయస్సార్ కాంగ్రెసు పార్టీకి మంచి మెజార్టీ ఇవ్వాలని కోరారు. రాబోయే ది కార్యకర్తల ప్రభుత్వం అని ,జక్కంపూడి కుటుంబం పై ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. ఈకార్యక్రమంలో పెందుర్తి దేవదాసు , ఎంపీపీ గుర్రాల జోత్స్న,ఎంపిటిసి తాడేపల్లి వెంకట్రావు, కోండ్రపు ముత్యాలు, చిట్టూరి వెంకటరామారావు తదితర వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోటికేశవరంలో ఘనంగా గురుపూజోత్సవం

కొమ్మనపల్లి ఆధ్వర్యంలో గురువులకు ఘనంగా సత్కారం



**కోరుకొండ, సెప్టెంబర్ 8, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని కోటికేశవరం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ సర్పంచ్ సింధుదివ్య కామేష్, మాజీ ఉప సర్పంచ్ కొమ్మనపల్లి గంగరాజు ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం కోటికేశవరం పాఠశాలలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధానోపాధ్యాయురాలు సుజాతరత్నం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కొమ్మనపల్లి మాట్లాడుతూ మన హిందూ సంస్కృతి సాంప్రదాయాల్లో గురువుకు అత్యంత ప్రాధాన్యత ఉందని, తల్లిదండ్రులు జన్మనిస్తే గురువు మన జీవితంలోని చీకటిని పారద్రోలి, క్రొత్త వెలుగులు నింపి మన జీవితాన్ని ఆదర్శంగా నడిపిస్తారన్నారు. అనంతరం పలువురు గురువు యొక్క ప్రాధాన్యతను తెలియజేస్తూ, గురువు చెప్పిన అడుగుజాడల్లో నడవాలన్నారు. అనంతరం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సుజాతరత్నం, సమాధానం, భగవాన్, ఎమ్మెస్ శర్మ, ఎం రాజేశ్వరరావు, బి విశ్వేశ్వరరావు, పి లోవరాజు, ఎన్ గోవింద్ కుమార్, సిహెచ్ సంతోష్, ఎన్ రాజు, జి నాగ సుశీల, జి రాజనందిని, జి పవిత్ర, పి శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు భూపతి, రవికుమార్ తదితలను పూలమాలలు వేసి సాల్వతో ఘనంగా సత్కరించి, వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సింధుదివ్య కామేష్, మాజీ ఉప సర్పంచ్ గంగరాజు, ఇసుకపల్లి సిద్దయ్య, తగరంపూడి వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులూ... చెడు స్నేహాలకు దూరంగా ఉండాలి

**చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలి - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచన**

**నారాయణ జూనియర్ కళాశాలలో 'మీ భద్రత.. మా బాధ్యత' నిర్వహణ**



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 8, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థులు చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ, చదువుతో పాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. విద్యార్థి దశలోనే మంచి విలువలు, నైతికత, క్రమశిక్షణను అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగగలరని ఆయన అన్నారు. మోరంపూడి శ్రీనగర్‌లోని నారాయణ జూనియర్ కళాశాల వద్ద నిర్వహించిన 'మీ భద్రత.. మా బాధ్యత' కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. క్రమశిక్షణతో ఏదైనా సాధించవచ్చని, జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని దానిని సాధించేందుకు నిరంతరం కష్టపడాలన్నారు. క్రమశిక్షణతో కూడిన జీవనశైలి, పట్టుదల ఉంటే మనిషి ఏదైనా సాధించగలడని చెప్పారు. ప్రస్తుతం యువత సోషల్ మీడియాలో రీల్స్ చూస్తూ సమయం వృథా చేయకుండా చదువుపై దృష్టి పెట్టాలని, మంచి ర్యాంకులు సాధించి తల్లిదండ్రులకు గౌరవం తీసుకురావాలని కోరారు. సినిమాల్లో మాదిరిగా నిజజీవితం ఉండదని, ఒకసారి జరిగిన తప్పును సినిమాలా మార్చుకునే అవకాశం జీవితంలో ఉండదన్నారు. మోరంపూడి ఫ్లైఓవర్‌పై జరిగిన ఒక ప్రమాదాన్ని ఉదాహరణగా చెబుతూ, రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ఎంత ముఖ్యమో వివరించారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో చదివిస్తున్నారని, ఆ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో నేరం జరిగిన తర్వాత నిందితులను గుర్తించేందుకు ఎక్కువ సమయం పట్టేదని, ప్రస్తుతం సీసీ కెమెరాల విస్తృత నిఘాతో నేరం జరిగిన వెంటనే నిందితులను గుర్తించే అవకాశం ఉందని తెలిపారు. తమను ఎవరూ చూడటం లేదని భావించి తప్పులు చేయవద్దని, ప్రతి చర్యకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. చెడు స్నేహాలకు దూరంగా ఉండాలి విద్యార్థులు స్నేహితులను ఎంపిక చేసుకునే విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇతరులు ఇచ్చే వస్తువులను, ముఖ్యంగా గుర్తుతెలియని వ్యక్తులు ఇచ్చే ప్యాకెట్లను పరిశీలించకుండా తీసుకెళ్లవద్దని హెచ్చరించారు. ఒక విద్యార్థికి స్నేహితుడి ద్వారా ఇచ్చిన ప్యాకెట్‌లో డ్రగ్స్ ఉండటంతో ఆమె కూడా కేసులో ఇరుక్కున్న ఘటనను ఉదాహరణగా వివరించారు. తెలియకుండా చేసినా చట్టపరమైన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, అందువల్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో షీ టీమ్స్ సమర్థవంతంగా పనిచేశాయని గుర్తుచేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మహిళల భద్రతకు మరింత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఎస్పీ సహకారంతో నియోజకవర్గంలో 'మహిళా రక్షక్' బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా శక్తి టీమ్స్ కూడా మహిళా కళాశాలల వద్ద ప్రత్యేకంగా పనిచేస్తున్నాయని చెప్పారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకున్నప్పుడు ఏం చదివారు..? ఎక్కడి నుంచి వచ్చారు..? అని అడిగితే గర్వంగా ఆంధ్రప్రదేశ్, రాజమహేంద్రవరం అని చెప్పుకునేలా మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి కార్యక్రమాన్ని ముగించారు. అలాగే లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, మహిళా పోలీసు విభాగాలకు చెందిన అధికారులు మాట్లాడుతూ విద్యార్థుల భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, మాదకద్రవ్యాల నివారణ, మహిళల రక్షణ, చట్టపరమైన అంశాలపై పలు సూచనలు చేశారు.

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పారదర్శకతతో పరిష్కరించాలి : కమిషనర్



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 8, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పారదర్శకతతో పరిష్కరించాలని కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. మంగళవారం ఉదయం ఏవీఏ రోడ్డు, జేఎన్ రోడ్డు, తారకరామ నగర్ సహా పలు ప్రాంతాలలో పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి పర్యటించారు. క్షేత్రస్థాయిలో ఇన్ ప్రిన్సిపుల్ లేఅవుట్ ప్యాట్రన్(ఐపిఎల్పీ)లను తనిఖీ చేసి, పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను స్వయంగా పరిశీలించారు. అలాగే రోడ్డు విస్తరణల కోసం వదిలేసిన స్థలాలలో ఎటువంటి నిర్మాణాలు కానీ, ఆక్రమణలు కానీ లేకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఏసీపీ కొండలరావు, ఇతర టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఉన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

# ఆదర్శ కుటుంబంలో ఎన్టీఆర్..

### థియేటర్స్‌లో పూనకాలే.! త్రివిక్రమ్ ప్లాన్ మామూలుగా లేదుగా..



టాలీవుడ్ లో విక్టరీ- వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ లది సూపర్ హిట్ కాంబినేషన్. గతంలో వీరిద్దరి కాంబోలో నువ్వు నాకు నచ్చావ్, మల్లీ శ్వరి వంటి మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్స్ వచ్చాయి. ఇప్పుడిదే కాంబినేషన్ లో రాబోతోన్న మరో సినిమా 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' ప్రస్తుతం వెంకటేష్ జోరు పెంచారు. వరుస హిట్స్ తో దూసుకుపోతున్న వెంకటేష్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైనప్ చేస్తున్నారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమా తర్వాత మన శంకర్ వరప్రసాద్ గారు సినిమాలో స్పెషల్ రోల్ చేశారు వెంకీ. సినిమా కూడా మంచి విజయాన్ని అందుకుంది. అలాగే ఇప్పుడు రెండు సినిమాలతో రాబోతున్నారు వెంకీ, త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా, అలాగే అనిల్ రావిపూడి డైరెక్షన్ లో ఓ సినిమా చేస్తున్నారు. ఇక వెంకటేష్ నటిస్తున్న సినిమాల్లో ఆదర్శ కుటుంబం శాఖ 47 చిత్రంపై మంచి అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఈ చిత్రానికి త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే ఈ మూవీకి సంబంధించిన భారీ షెడ్యూల్ షూటింగ్ కంప్లీట్ చేశారు. జెట్ స్పీడ్ షూటింగ్ తో దూసుకుపోతున్న ఈ సినిమాలో శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తుంది. మొన్నామధ్య ఈ సినిమా నుంచి వరుసగా గ్లింప్స్ ను విడుదల చేశారు. ఈ క్రమంలోనే తాజాగా ఈ మూవీ నుంచి ఓ క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో వైరలవుతుంది. అదేంటంటే ఆదర్శ కుటుంబంలోకి ఓ స్టార్ హీరో కూడా ఎంట్రీ ఇవ్వనున్నారని తెలుస్తుంది. ఆయన మరెవరో కాదు స్టార్ హీరో మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్. అవును ఎన్టీఆర్ ఆదర్శకుటుంబంలోకి ఎంట్రీ ఇచ్చారు. అయితే ఆయన ఈ సినిమాలో గెస్ట్ రోల్ చేయడంలేదు. కేవలం వాయిస్ ఓవర్ మాత్రమే ఇస్తున్నారని తెలుస్తుంది. గతంలో వెంకటేష్ నటించిన చింతకాయల రవి సినిమాలో ఓ సాంగ్ లో ఎన్టీఆర్ అలా కనిపించి రెండు స్టెప్పులేస్తారు. ఇక ఇప్పుడు వెంకీ సినిమాకు తారక్ వాయిస్ ఓవర్ ఇస్తున్నారని తెలుస్తుంది. అలాగే ఎన్టీఆర్, త్రివిక్రమ్ కు కూడా మంచి బాండింగ్ ఉంది. ఈ ఇద్దరూ కలిసి అరవింద సమేత అనే సినిమా చేశారు. ఈ సినిమా భారీ విజయాన్ని అందుకుంది. ఆ స్నేహంతోనే ఇప్పుడు ఆదర్శ కుటుంబానికి తారక్ వాయిస్ ఓవర్ ఇస్తున్నారని తెలుస్తుంది. ఇటీవలే అఖిల్ లెనిన్ సినిమాకు కూడా ఎన్టీఆర్ వాయిస్ ఇచ్చారు. ఇక ఆదర్శకుటుంబం సినిమా కామెడీ, క్రైమ్, డ్రామా, ఫ్యామిలీ, థ్రిల్లర్ గా రాబోతుంది. ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు.

### విజయ్‌తో సినిమా ఛాన్స్.. త్రిష పంపిన ఆ మెసేజ్

# ఎప్పటికీ గుర్తుండిపోతుంది.. మాళవికా మోహనన్



ఇప్పుడిప్పుడే తెలుగులో వరుస అవకాశాలు అందుకుంటున్న హీరోయిన్ మాళవిక మోహనన్. మలయాళం, తమిళం, హిందీ, కన్నడ మరియు తెలుగు చిత్రాలలో నటించి గుర్తింపు పొందారు. రాజా సాబ్ సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన ఈ అమ్మడు.. తాజాగా చేసిన కామెంట్స్ వైరలవుతున్నాయి. కోలీవుడ్ దళపతి విజయ్ సరసన 'మాస్టర్' చిత్రంలో నటించి దక్షిణాది ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక మాళవికా మోహనన్. ఈ సినిమా విడుదలైన సమయంలో ఆమె నటనకు, అందానికి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మాళవికా, 'మాస్టర్' సినిమా షూటింగ్ సమయంలో సీనియర్ నటి త్రిష గురించి పంచుకున్న ఒక ఆసక్తికరమైన విషయాలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. దళపతి విజయ్‌తో పనిచేయడం అనేది ఏ హీరోయిన్‌కైనా ఒక గొప్ప అనుభవమని, ఆయనకు ఉన్న ఫ్యాన్ బేస్ , క్రేజ్ అపారమైనదని మాళవికా పేర్కొన్నారు. 'మాస్టర్' ప్రాజెక్ట్‌లోకి తాను ఎంపికైనప్పుడు చాలా సంతోషపడ్డానని, అలాగే అంత పెద్ద స్టార్ సరసన నటించేటప్పుడు కొంత ఒత్తిడి కూడా అనిపించిందని ఆమె తెలిపారు. విజయ్‌తో సినిమా చేస్తున్నానని తెలిసిన వెంటనే నటి త్రిష తనకు స్వయంగా మెసేజ్ చేశారని మాళవికా గుర్తుచేసుకున్నారు. తమిళంలో విజయ్-త్రిష జోడీకి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వీరిద్దరి కాంబినేషన్లో వచ్చిన 'గిల్లి', 'తిరుపాచి', 'కురువి' వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలు సాధించాయి. అలాంటి క్రేజీ కాంబినేషన్ అయిన త్రిష, మాళవికాకు మెసేజ్ చేస్తూ... "విజయ్‌తో పనిచేయడం నీకు ఒక వండర్‌ఫుల్ ఎక్స్‌పీరియన్స్ అవుతుంది. సెట్స్‌లో ఆయన ఇచ్చే రెస్పెక్ట్, ప్రొఫెషనలిజం నిన్ను ఆకట్టుకుంటాయి. ఎంజాయ్ ది షూటింగ్" అని శుభాకాంక్షలు తెలిపారట. సహచరుడైన ఒక పెద్ద హీరోతో పనిచేస్తున్నప్పుడు తోటి హీరోయిన్ అంత సానుకూలంగా స్పందించి మెసేజ్ చేయడం తనను ఎంతగానో ప్రభావితం చేసిందని మాళవికా ఆనందం వ్యక్తం చేశారు. విజయ్ చాలా స్వీట్ పర్సన్ అని, సహనటులకు ఎంతగానో గౌరవం ఇస్తారని త్రిష చెప్పినట్లే, షూటింగ్ సమయంలో తనకు కూడా విజయ్ నుంచి అలాంటి గొప్ప సహకారం లభించిందని మాళవికా తెలిపారు.

# ఇరుముడిని వెంటాడుతున్న వివాదాలు.. మందు తాగే వాళ్ళు మాత్రమే వేస్తారా..?



మాస్ మహరాజా రవితేజ- శివ నిర్వాణ కాంబినేషన్‌లో వచ్చిన లేటెస్ట్ సినిమా 'ఇరుముడి'. తండ్రి, కూతుళ్ల సెంటిమెంట్ తో తెరకెక్కిన ఈ సినిమా సంచలన విజయం సాధించింది. ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఇరుముడి సినిమా ఇప్పటికే రూ. 200 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది. రవితేజ నటించిన ఇరుముడి సినిమా విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ సాధించింది. ఈ సినిమాకు ఊహించని రెస్పాన్స్ వస్తుంది. అంతా బాగుంది. రవన్న ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. చాలా కాలంగా హిట్స్ లేక సతమతం అవుతున్న రవితేజ ఇరుముడి సినిమాతో సెన్సేషనల్ హిట్ అందుకున్నారు. ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర కాసుల వర్షం కురిపిస్తుంది. అయితే ఇప్పటికే ఈ సినిమా 200కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఈ సినిమాను దర్శకుడు శివ నిర్వాణ అద్భుతంగా తెరకెక్కించారు. కథ, కథనం అన్ని ప్రేక్షకులను ముఖ్యంగా అన్ని వర్గాల ఆడియన్స్ ను ఆకట్టుకున్నాయి. ఇదిలా ఉంటే గతంలో ఇరుముడి సినిమా ఓ వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే.. ప్రభుత్వ పాఠశాల టీచర్స్ గురించి సినిమాలో తప్పుగా చూపించారని కొందరు విమర్శలు చేశారు. ఈ విమర్శలతో పాటు సినిమాను అడ్డుకుంటామని కూడా హెచ్చరించారు. దీనిపై శివ నిర్వాణ క్లారిటీ కూడా ఇచ్చాడు. ఎవ్వరిని కించపరచలేదని.. కొందరు విష పురుగులు కూడా ఉంటారని చెప్పడమే తన ఉద్దేశమని శివ క్లారిటీ ఇచ్చారు. దాంతో ఆ గొడవ సద్దుమణిగింది. ఇక ఇప్పుడు మరో వివాదం ఇరుముడిని చుట్టుముట్టింది. సినిమాలో హీరో అయ్యప్ప మల వేసుకోవడం పై కొందరు విమర్శలు చేస్తున్నారు. అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరుముడి సినిమాను తాము ఆలస్యంగా చూశామని అయితే సినిమాలో గురు స్వాములకు కళంకం తెచ్చేలా కొన్ని సన్నివేశాలు ఉన్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం మందు తాగేవాళ్లే అయ్యప్ప మాల వేస్తారని, దీక్ష ముగిసిన వెంటనే మళ్లీ తాగుతారని అనే విధంగా 'ఇరుముడి' సినిమాలో చూపించారని అయ్యప్ప దీక్ష సమితి సభ్యులు ఆరోపించారు. అయ్యప్ప మల అనేది చాలా పవిత్రమైంది. ఇరుముడి కట్టుకొని శబరిమలకు వెళ్తే స్వామివారు ఆ కుటుంబాన్ని కాపాడారు అనే విధంగా కాకుండా.. ఇరుముడి అని పేరు పెట్టుకుని కమర్షియల్ అంశాలతో క్రైమ్ నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించడం చాలా బాధగా ఉంది అయ్యప్ప దీక్ష ప్రచార సమితి సభ్యులు అన్నారు. ఈ సినిమాను తెరకెక్కించినందుకు హీరో, దర్శకుడితో పాటు చిత్రబృందం మొత్తం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి సభ్యులు. దీనిపై చిత్రయూనిట్ ఎలా స్పందిస్తుందో చూడాలి.

# దులీప్ ట్రోఫీ ఫైనల్.. మూడో రోజూ ఈస్ట్ జోన్‌దే జోరుల



సౌత్ జోన్‌తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో మొదటి రెండ్రోజులు బ్యాట్‌తో అదరగొట్టిన ఈస్ట్ జోన్.. మూడో రోజు బౌలింగ్‌లోనూ సత్తాచాటింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ (270; 334 బంతుల్లో) భారీ డబుల్ సెంచరీకితోడు మిగతా బ్యాటర్లూ రాణించడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఈస్ట్ జోన్ 708 పరుగుల భారీ స్కోరు సాధించిన విషయం తెలిసిందే. మంగళవారం, మూడో రోజు తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన సౌత్ జోన్ తడబడుతోంది. ఏ ఒక్క బ్యాటర్ కూడా భారీ స్కోరు చేయకపోవడంతో ఆట ముగిసే సమయానికి 242/6 స్కోరుతో నిలిచింది. కెప్టెన్ తిలక్ వర్మ (56) అర్ధ శతకం చేయగా.. అతడితోపాటు చామ మిలింద్ (2) క్రీజులో ఉన్నాడు. ఫామ్‌లో ఉన్న దేవదత్ పడిక్కల్ (62; 104 బంతుల్లో 4 ఫోర్లు) హాఫ్ సెంచరీ చేసినా దాన్ని భారీ స్కోరుగా మలచలేకపోయాడు. నారాయణ్ జగదీశన్ (32), షేక్ రషీద్ (27), శ్రేయస్ గోపాల్ (26), స్మరన్ రవిచంద్రన్ (23) పరుగులు చేశారు. ఓపెనర్ రికీ భుయ్ (1) సింగిల్ డిజిట్ స్కోరుకే వెనుదిరిగాడు. ఈస్ట్ జోన్ బౌలర్లలో మహ్మద్ షమి, ముకేశ్ కుమార్ రెండేసి వికెట్లు పడగొట్టగా.. శిఖర్ మోహన్, ఎండీ కౌనైన్ ఖురేషీకి ఒక్కో వికెట్ దక్కింది. ఇంకా రెండు రోజుల ఆట మిగిలిన ఉన్న మ్యాచ్‌లో ప్రస్తుతం సౌత్ జోన్ 466 పరుగుల వెనుకంజలో ఉంది.

# పాక్‌కు షాకిచ్చిన అఫ్గాన్ క్రికెట్ బోర్డ్




భారత్‌తో జరగనున్న టీ20 సిరీస్ కోసం అఫ్గాన్ క్రికెట్ బోర్డు ఓ ప్రచార వీడియో రూపొందించింది. ఇందులో పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్, గిల్గిట్-బల్టిస్థాన్‌లను భారత్‌లో భాగంగా చూపింది. దీంతో ఇరుదేశాల మధ్య కొత్త దౌత్యపరమైన వివాదానికి తెరలేచింది. ఆ మ్యాప్‌పై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు.. పాకిస్థాన్ విదేశాంగ శాఖ వద్ద ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ విషయంలో పాకిస్థాన్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక చర్యలకు దిగలేదు. అయితే, అంతర్జాతీయ స్థాయిలో ఈ అంశాన్ని లేవనెత్తాలని చూస్తోంది. సరిహద్దు ఘర్షణలు, వైమానిక దాడులతో అఫ్గాన్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతోన్న తరుణంలో ఈ తాజా వివాదం తలెత్తింది. దేశంలో జరుగుతోన్న దాడులకు కారణమని పాకిస్థాన్ ఆరోపిస్తున్న తెహ్రిక్-ఎ-తాలిబన్ పాకిస్థాన్‌కు అఫ్గాన్ తాలిబన్లు ఆశ్రయం కల్పిస్తున్నారని ఇస్లామాబాద్ ఆరోపిస్తోంది. అఫ్గాన్, భారత్ మధ్య సెప్టెంబరు 13 నుంచి దిల్లీ వేదికగా మూడు టీ20ల సిరీస్ ప్రారంభంకానుంది. ఈ సిరీస్‌కు అఫ్గానిస్థాన్ ఆతిథ్య దేశంగా వ్యవహరిస్తోంది.

# మొన్న ఇచ్చిన షాక్ సరిపోలేదేమో..

### పాక్‌కు టీమిండియా ఫ్యాన్స్ కౌంటర్




మహిళల ఆసియా కప్‌లో భారత్ చేతిలో ఘోర ఓటమి చవిచూసినా.. పాకిస్థాన్ సెమీ ఫైనల్స్‌కు చేరింది. సోమవారం దుబాయ్‌లో తమ చివరి గ్రూప్ మ్యాచ్‌లో హాంకాంగ్, చైనాను పాక్ 72 పరుగుల తేడాతో ఓడించి సెమీస్ బెర్తును ఖరారు చేసుకుంది. ఈ మ్యాచ్ అనంతరం పాకిస్థాన్ మహిళా క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ వహాబ్ రియాజ్ స్టేడియంలో ఉన్న పాక్ అభిమానులతో ముచ్చటించాడు. ఈ క్రమంలో ఓ అభిమాని వహాబ్‌కు ఒక అభ్యర్థన చేశాడు. పాకిస్థాన్ అభిమానులకు ఆసియా కప్ ట్రోఫీ వద్దని, కానీ పాక్ మహిళా జట్టు భారత్‌ను ఓడించాలని విజ్ఞప్తి చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. టీమ్‌ఇండియా ఫ్యాన్స్ కౌంటర్ ఇస్తున్నారు. "వారు (పాక్) క్రికెట్‌ను యుద్ధంలా, యుద్ధాన్ని ఆటలా ఆడతారు. కానీ రెండు సందర్భాల్లోనూ ఓటమి శాశ్వతం" అని ఓ నెటిజన్ కామెంట్ చేయగా.. "మొన్న ఇచ్చిన షాక్ సరిపోలేదనుకుంటా.. ఫైనల్‌కు రండి.. ఈ సారి అంతకు మించిన ట్రీట్ టీమ్‌ఇండియా ఇస్తుంది" అని మరో యూజర్ అన్నాడు.

**ఫైనల్లో భారత్, పాక్?**

ఇప్పటికే భారత్, పాక్ గ్రూప్‌లో దశలో ఒకసారి తలపడ్డాయి. ఈ చిరకాల ప్రత్యర్థులు మరోసారి తలపడే అవకాశం ఉంది. ఎందుకంటే ఈ రెండు టీమ్‌లు సెమీస్‌కు చేరాయి. అందులో విజయం సాధిస్తే ఫైనల్‌లో భారత్, పాక్ అమీతుమీ తేల్చుకుంటాయి. గ్రూప్ దశలో వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచిన హర్మన్‌ప్రీత్ సేన సెమీస్‌కు చేరిన విషయం తెలిసిందే. మంగళవారం బంగ్లాదేశ్, యూఏఈ మధ్య జరిగే మ్యాచ్‌లో విజేతగా నిలిచిన జట్టుతో భారత్ సెమీ ఫైనల్ (సెప్టెంబరు 10న) ఆడుతుంది. ఇక, రెండో సెమీ ఫైనల్‌లో శ్రీలంకతో పాక్ తలపడనుంది. ఫైనల్ మ్యాచ్ సెప్టెంబరు 13న జరగనుంది.

# పీసీబీ ఇంకా వేల డాలర్లు బకాయి ఉంది

### పాక్ మాజీ కోచ్ జేసన్ గెలెస్పీ



ఆస్ట్రేలియా మాజీ బౌలర్ జేసన్ గిలెస్పీ 2024లో పాకిస్థాన్ టెస్టు కోచ్‌గా పనిచేసిన విషయం తెలిసిందే. పాక్ కోచ్‌గా ఉన్నప్పుడు తనకు ఎదురైన చేదు అనుభవాలను తాజాగా గుర్తుచేసుకున్నాడు. పాక్ చీఫ్ సెలక్టర్ అకిబ్ జావేద్ తనను అగౌరవపరిచిన సంఘటనలను ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నాడు. కోచ్ పదవి కాలానికి సంబంధించి పీసీబీ తనకు ఇంకా వేల డాలర్లు బాకీ ఉందని పేర్కొన్నాడు. "అకిబ్ జావేద్‌ను చీఫ్ సెలక్టర్‌గా నియమించడంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఆ క్షణం నుంచే పాకిస్థాన్ క్రికెట్‌తో నాకున్న సంబంధం పూర్తిగా మారిపోయింది. ప్రతి విషయంలోనూ ఆయన పెత్తనమే కొనసాగింది. టెస్టు జట్టు బాధ్యతలు చూడటం, ఆటగాళ్లు, సిబ్బందిని పర్యవేక్షించడం, జట్టు ఎంపిక.. ఇలా ఏ విషయంలోనూ ఎటువంటి పాత్ర లేని స్థితికి వచ్చాను. ఆ అనుభవం నన్ను పూర్తిగా నిరుత్సాహపరిచి, కోచింగ్‌పై విరక్తి కలిగించింది. అది నాపై మానసికంగా ప్రభావం చూపింది. నన్ను నేను సందేహించుకునేలా చేసింది. అకిబ్ జావేద్ నా పట్ల పూర్తిగా అగౌరవంగా ప్రవర్తించాడు. అతడికి బోర్డు మద్దతు ఉంది. అందుకే తనను ఎవరూ ఏమీ చేయలేరని అనుకుంటున్నాడు. ప్రస్తుతం జరుగుతోన్న పరిణామాలను చూస్తుంటే చాలా బాధగా ఉంది. దీనికి అసలు కారకుడు అకిబ్ జావేద్. అతడు అక్కడ ఉన్నంత కాలం పాకిస్థాన్ క్రికెట్ వెనకడుగు వేస్తూనే ఉంటుంది" అని జేసన్ వివరించాడు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com